నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

సంగారెడ్డిలో అమ్మవారి లడ్డూను దక్కించుకున్న ముస్లిం వ్యక్తి

సంగారెడ్డి, అక్టోబర్ 18: కంది మండలం మామిడిపల్లి గ్రామంలో కనకదుర్గ అమ్మవారి లడ్డూను ముస్లిం వ్యక్తి దక్కించుకున్నాడు. గ్రామంలో నవరాత్రుల సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని హిందూవులు ప్రతిష్టించారు. నవరాత్రుల చివరి రోజు అమ్మవారి విగ్రహం నిమజ్జనం కంటే ముందు.. లడ్డూను వేలం వేశారు. ఈ వేలం పాటలో హిందూవులతో పాటు ముస్లిం యువకుడు మహ్మద్ ఫరీద్(31) పాల్గొన్నాడు. గ్రామ రెవెన్యూ సహాయ అధికారిగా పని చేస్తున్న ఫరీద్.. ఈ వేలం పాటలో రూ. 55 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. ఆ లడ్డూను గ్రామ ప్రజంలదరికీ పంచిపెడుతానని ఫరీద్ చెప్పాడు. వినాయక చవితి, దసరా పండుగలను తన స్నేహితులతో కలిసి జరుపుకున్నానని ఫరీద్ పేర్కొన్నాడు.

హైదరాబాద్ మంగళవారం 19-10-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 70 పేజీలు:4 వెల: రూ.1/-

టీఆర్ఎస్ పార్టీలో చేరిన మోత్కుపల్లి నర్సింహులు

హైదరాబాద్ , అక్టోబర్ 18: నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్.. మోత్కుపల్లి నర్సింహులు టీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు మోత్కుపల్లి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీశ్ రెడ్డి, మండలి మాజీ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌కు రాజకీయాలంటే ఒక యజ్ఞం.. మిగతా పార్టీలకు ఒక గేమ్..

హైదరాబాద్ , అక్టోబర్ 18: ఇతర రాజకీయ పార్టీలకు రాజకీయాలు అంటే ఒక గేమ్.. కానీ టీఆర్ఎస్‌కు అట్ల కాదు. టీఆర్ఎస్‌కు ఇది ఒక టాస్క్.. ఒక యజ్ఞం. పట్టువట్టి పని చేయాలి అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. మోత్కుపల్లి నర్సింహులు టీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేసీఆర్ ప్రసంగించారు. నర్సింహులు రాజకీయాల కోసం టీఆర్ఎస్ పార్టీలో చేరలేదు. మోత్కుపల్లికి కరోనా వచ్చినప్పుడు కోటి ఖర్చు అయినా పర్లేదు.. ఆయనకు మంచి వైద్యం అందించాలని చెప్పాను. మేమిద్దరం మంచి స్నేహితులం. మోత్కుపల్లితో నా స్నేహం రాజకీయాలకు అతీతం. దళితబంధు భేటీలకు మోత్కుపల్లి హాజరయ్యారు. దళిత బంధు పథకానికి తోడవుతానని మోత్కుపల్లి తనతో అన్నారు.

దళిత బంధుతో బలహీన వర్గాలను బలోపేతం చేసే యజ్ఞం ఇక్కడితో ఆగదు. గిరిజనులు, బీసీలు, ఈబీసీల్లో కూడా వస్తది. వచ్చిన ఆదాయాన్ని ప్రజలకు ఏదో రూపంలో పంచుతాం. అతి ఎక్కువ బాధలో, దుఃఖంలో ఉన్న ప్రజలకు ముందు మేలు చేస్తాం. బలహీన వర్గాలకు వంద శాతం ఆదుకోవాలి. అప్పుడే గొప్పదనం ఉంటుంది. దళిత బంధుకు రూ. లక్షా 70 వేల కోట్లు ఖర్చు పెట్టాలని నిర్ణయించాం. ఈ కార్యక్రమాన్ని ఇక్కడితో ఆపం. అన్ని నియోజకవర్గాల్లో అమలు చేస్తాం. దళిత బంధు ద్వారా రాష్ట్రానికి రూ. 10 లక్షల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. భారత దళిత సమాజానికి తెలంగాణ దళిత సమాజం దిక్సూచి కావాలి. కర్ణాటకలోని రాయ్‌చూర్ ప్రజలు కూడా తెలంగాణలో కలుస్తామని అంటున్నారు. తెలంగాణ పథకాలు ఇతర రాష్ట్రాల ప్రజలను ఆకర్షిస్తున్నాయి అని సీఎం కేసీఆర్ అన్నారు.

ప్రాణం పోయినా దళిత బంధును వదలం : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , అక్టోబర్ 18:తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని ప్రాణం పోయినా వదలం అని సీఎం కేసీఆర్ తేల్చిచెప్పారు. మోత్కుపల్లి నర్సింహులు టీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు.

తెలంగాణలో అతిపెద్ద కులం దళిత కులం. 75 లక్షల మంది జనాభా దళితులు ఉన్నారు. అందరీ కన్నా తక్కువ భూమి దళితుల వద్ద ఉంది. 13 లక్షల ఎకరాల భూమి మాత్రమే దళితుల వద్ద ఉంది. 9 శాతం మంది ఉన్న గిరిజనుల వద్ద 22 లక్షల ఎకరాల భూమి వద్ద ఉంది. దళితుల వద్ద 13 లక్షల ఎకరాల భూమి కూడా ఉందో లేదో తెలియదు. లెక్క తీస్తే తెలుస్తది. దళితులను బతుకనివ్వలేదు. జనాభా ఎక్కువ ఉన్నది. అవకాశాలు తక్కువ ఉన్నాయి.

అంబేద్కర్ పుణ్యమా అని ఎస్సీలకు రిజర్వేషన్ ఫలాలు అందాయి. అంబేద్కర్ పుణ్యంతో కొంతమంది పిల్లలు చదువుకుని ఉన్నత ఉద్యోగాలు పొందారు. కొందరు ఎమ్మెల్యేలు అయ్యారు. అట్టడుగు స్థాయిలో ఉన్న వారి కోసం అంబేద్కర్ పోరాటం చేశారు. తెలంగాణ తేవడం ఎంత పెద్ద యజ్ఞమో.. దళిత బంధును విజయవంతం చేయడం అంతే పెద్ద యజ్ఞం అని అన్నారు. ప్రాణం పోయినా దళిత బంధును వదలం. సంవత్సరానికి కొంత మందికి అమలు చేస్తాం. ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి వంద మందికి కచ్చితంగా ఈ పథకం అమలు చేస్తాం.

వచ్చే ఎన్నికల్లో కూడా టీఆర్ఎస్ పార్టీనే గెలుస్తుంది. ఈ ఏడేండ్లలో తెలంగాణ పెట్టబోయే ఖర్చు రూ. 23 లక్షల కోట్ల బడ్జెట్ ఉటుంది. వచ్చే ఏడేండ్లలో రూ. 1.7 లక్షల కోట్లు ఖర్చు పెట్టడం పెద్ద విషయం కాదు. ఈ కార్యక్రమాన్ని ఇక్కడితో ఆపాం. అన్ని నియోజకవర్గాల్లో అమలు చేస్తాం. దళిత బంధు ద్వారా రాష్ట్రానికి రూ. 10 లక్షల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. భారత దళిత సమాజానికి తెలంగాణ దళిత సమాజం దిక్సూచి కావాలి అని సీఎం కేసీఆర్ అన్నారు.

గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో 50 దేశాల ఎన్నారైల సమావేశం

హైదరాబాద్ , అక్టోబర్ 18:హుజురాబాద్ టీఆర్ఎస్ అభ్యర్థికి దేశ విదేశాల నుంచి వివిధ వర్గాల నుంచి రోజురోజుకు మద్దతు పెరుగుతున్నది. హుజురాబాద్ నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా గెల్లుకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

కాగా, ప్రపంచ వ్యాప్తంగా 50 దేశాల్లో ఉన్న టీఆర్ఎన్ ఎన్నారై శాఖల ప్రతినిధులతో టీఆర్ఎస్ ఎన్నారై శాఖల కోఆర్డినేటర్ మహేష్ బిగాల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వల్లా రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ..ఉద్యమ నాయకుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నారైలు హుజురాబాద్‌లో ఉన్న బంధువులకు, మిత్రులు, శ్రేయోభిలాషులతో మాట్లాడి గెల్లు అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. మంచి మెజారిటీ తో గెలిపించాలని ఆకాంక్షించారు .

గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ మలి దశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నానని తెలిపారు. 2001 నుంచి నేటి వరకు తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా కీలకపాత్ర పోషించాను.

ఈ కార్యక్రమాన్ని అన్ని దేశాల ప్రతినిధులతో నిర్వహించినందుకు అన్ని దేశాల ప్రతినిధులకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.

మహేష్ బిగాల మాట్లాడుతూ.. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీయే గెలుస్తుందన్నారు. మా ఎన్నారై అన్ని శాఖలు ఈ ఎన్నికల్లో వాళ్లకు సోషల్ మీడియా, టెలిఫోనిక్ కాంపెయిన్, ప్రత్యక్షంగా పాల్గొనడం ఇలా వారికి తోచిన విధంగా సహకరిస్తామన్నారు. కార్యక్రమములో ఎన్నారై ప్రతినిధులు అనిల్ కూర్మాచలంతో పాటు వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. వారు గెల్లుకు తమ సంపూర్ణ మద్దతును తెలిపారు.

కట్నం అడిగితే దవుడ మీద గుంజికొట్టు.. సీఎం కేసీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్ , అక్టోబర్ 18:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి పథకంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మోత్కుపల్లి నర్సింహులు టీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు.

శ్రీరామనవమి తర్వాత బిడ్డ పెళ్లి చేద్దామని ములుగులో ఒకాయన డబ్బులు జమ చేసి పెడితే.. ఇల్లు కాలి డబ్బులు కూడా కాలిపోయాయి అని మొర పెట్టుకున్నారు. ఇక నేనే లక్ష రూపాయాలిచ్చి పెళ్లి చేయించాను. ఆ బాధల నుంచి పుట్టిందే కళ్యాణలక్ష్మి పథకం. పుట్టింది కానీ మీరు దయచేసి పని చేస్తలేరు. ఇప్పుడు గమ్మత్తు మోపైంది.

పెండ్లి అనంగానే కేసీఆరే లక్ష రూపాయాలు ఇస్తుండ్రు.. నీవు ఎంత ఇస్తవు అని అంటుండ్రు. కట్నం ఇంకా ఇస్తుండ్రా అని ఒకాయనను అడిగితే అవున్ సర్ అన్నడు. కట్నం అడిగితే అక్కడినే దవుడ మీద గుంజికొట్టు.. అన్నే పండ్లు రాలిపోతయి అని చెప్పిన.

పేదోళ్లు బాకీల పాలు కావొద్దు.. ఇబ్బంది రావొద్దని చెప్పి, పెళ్లి ఖర్చు అయిపోవాలని పెట్టిన స్కీం కళ్యాణలక్ష్మి. కేసీఆర్ ఇస్తుండు.. నీవేం ఇస్తవో చెప్పు అంటే.. ఇస్త పటు బిడ్డ అని ఇయ్యాలె. ఒకరి ఇద్దరిని ఉతికితే దెబ్బకు అదుగుడు ఆగిపోతది.

గరీబోళ్లు, పేదలు లక్ష రూపాయాల లోపే పెళ్లి వడగొట్టే వాళ్లున్నారు. ఇది సమాజంలో మంచిది కాదు. ఇది తప్పురా.. దుర్మార్గుడా అని చెప్పాలి. ఇలాంటి వాటిని తిరస్కరణ చేయాలి. ఇన్‌సల్ట్ చేయాలి. మన సమాజాన్ని మనమే బాగు చేసుకోవాలి. ఎక్కడివారు అక్కడే కథా నాయకుడైతేనే.. అక్కడ మంచి ఫలితాలు, లాభాలు వస్తాయని సీఎం కేసీఆర్ అన్నారు.

రంజిత్ సింగ్ హత్య కేసు.. దేరా బాబాకు జీవిత ఖైదు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:రంజిత్ సింగ్ హత్య కేసులో గుర్మీత్ రామ్ రహీమ్ (దేరా బాబా) తోపాటు మరో నలుగురు నిందితులకు పంచకులలోని సీబీఐ స్పెషల్ కోర్టు శిక్షలను ఖరారు చేసింది. నిందితులు ఐదుగురికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. రంజిత్ సింగ్ హత్య కేసులో దేరా బాబాతోపాటు అవతార్ సింగ్, కృష్ణ్ లాల్, జస్బీర్ సింగ్, సబ్దీల్ సింగ్‌లను దోషులుగా పేర్కొంటూ కోర్టు ఈ నెల 8న తీర్పు చెప్పింది. శిక్షల ఖరారును ఇవాల్టికి వాయిదా వేసింది. ఆ మేరకు ఇవాళ నిందితులు ఐదుగురికీ శిక్షలు ఖరారు చేసింది.నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షలతోపాటు జరిమానాలు కూడా భారీగానే విధించింది. దేరాబాబాకు రూ.31 లక్షలు, అవతార్ సింగ్‌కు రూ.1.50 లక్షలు, సబ్దీల్ సింగ్‌కు రూ.1.25 లక్షలు, జస్బీర్ సింగ్, కృష్ణ్ లాల్‌కు చెరో రూ.75 వేల చొప్పున జరిమానా విధించింది. వాస్తవానికి అక్టోబర్ 12న శిక్షలను ఖరారు చేయాల్సి ఉండగా.. కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. జరిమానా సొమ్ములో 50 శాతం బాధిత కుటుంబానికి అందజేయనున్నట్టు కోర్టు స్పష్టం చేసింది.

కాగా, ఇదే కేసులో నిందితుడిగా ఉన్న మరో వ్యక్తి ఇందర్ సైన్ గతేడాది అనారోగ్యంతో చనిపోయాడు. దేరా సచ్చా సౌదాలో మేనేజర్‌గా పనిచేసే రంజిత్ సింగ్ 2002 జూలై 10న హత్యకు గురయ్యాడు. ఆశ్రమంలోని మహిళలను సెక్స్ బానిసలుగా చేసుకుని దేరా బాబా చేస్తున్న అరాచకాలకు సంబంధించి అప్పట్లో ఒక లేఖ బయటికి వచ్చింది. అయితే, తన అరాచకాలను బయటి ప్రపంచానికి తెలియజెప్పడానికి రంజిత్ సింగే ఆ పని చేసినట్లు దేరా బాబా అనుమానించి హత్య చేయించాడు.

కాగా, ఆశ్రమంలోని ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసిన కేసులో కూడా దేరా బాబాకు ఇప్పటికే 20 ఏండ్ల జైలుశిక్ష పడింది. ఆయన భక్తి ముసుగులో మహిళలను సెక్స్ బానిసలుగా మార్చినట్టు రుజువైంది. దేశవ్యాప్తంగా వందల కోట్ల రూపాయల ఆస్తుల్ని వెనకేసుకున్నట్లు తేలింది. భక్తి పేరుతో కారుచౌకగా భూములను కొనుగోలు చేసి తాను నమ్మిన భక్తుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాడు. రిజిస్ట్రేషన్ విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు దర్యాప్తులో బయటపడింది.

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసిన సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు

హైదరాబాద్ , అక్టోబర్ 18:రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును పలు జిల్లా పరిషత్‌ల సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో సోమవారం కలిశారు. తమకు పదోన్నతులు కల్పించినందుకు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా, ప్రజలకు ప్రభుత్వ పథకాలన్నీ సకాలంలో అందేవిధంగా పని చేయాలని మంత్రి ఈ సందర్భంగా వారిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సీఈఓలు, డిప్యూటీ సీఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్ రావు, ఎంపీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం సత్తయ్య, పలువురు సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు ఉన్నారు.

భారత్, పాక్ మధ్య టీ 20 మ్యాచ్‌పై పునరాలోచించండి: కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:: భారత్, పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ఈ నెల 24న దుబాయ్‌లో జరుగనున్న టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌పై పునరాలోచించాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కోరారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు మంచిగా లేనందున దీనిపై నిర్ణయం తీసుకోవాలన్నారు. 'భారత్, పాకిస్థాన్ మధ్య సంబంధాలు బాగా లేనట్లయితే ఈ మ్యాచ్‌పై పునరాలోచించాలని నేను భావిస్తున్నా' అని మీడియా ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు పౌరులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపి హత్య చేస్తున్నారు. గత రెండు వారాల్లో 11 మంది పౌరులు ఉగ్రవాదుల కాల్పుల్లో చనిపోయారు. ఈ నేపథ్యంలో భారత్, పాక్ మధ్య ఈ నెల 24న జరుగనున్న టీ 20 మ్యాచ్‌పై పునరాలోచించాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యానించారు. మరోవైపు దేశంలోని పలు వర్గాల నుంచి కూడా ఇలాంటి డిమాండ్ వ్యక్తమవుతున్నది.

నేడు యాదాద్రికి వెళ్లనున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్ , అక్టోబర్ 18:: ఈ నెల 19న ముఖ్యమంత్రి కేసీఆర్ యాదాద్రి పర్యటనకు వెళ్లనున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 11:30 గంటలకు యాదాద్రి బయల్దేరనున్నారు. యాదాద్రి పునర్నిర్మాణ పనులను సీఎం కేసీఆర్ పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా యాదాద్రి పునఃప్రారంభ తేదీలను సీఎం కేసీఆర్ ప్రకటించనున్నారు.

యాదాద్రి పున: ప్రారంభం తేదీ ముహూర్తాన్ని ఇప్పటికే చినజీయర్ స్వామి నిర్ణయించి వున్నారు. ఈ నేపథ్యంలో యాదాద్రిలోనే ఆలయ పున: ప్రారంభం తేదీలను కేసీఆర్ స్వయంగా ప్రకటిస్తారు. పున: ప్రారంభం సందర్భంగా నిర్వహించనున్న మహా సుదర్శన యాగం వివరాలను, తేదీలను కూడా సీఎం కేసీఆర్ ప్రకటించనున్నారు.

చరిత్రలో నేటినిజం



కం॥ భీబల సంపన్నుడనుచు
ప్రొబల్లరు నాంధ్రనట్టి రసవిదుడనుచున్
నోబెలుబహుమతి నాంధిన
నోబుల గుణ శేఖరు నకు నుతులర్పింతున్॥

(అక్టోబర్ 19 నోబెల్ బహుమతి గ్రహీత సుబ్రహ్మణ్యం చంద్రశేఖరు జయంతి...)

-రాధశ్రీ
సెల్: 9494481210

ఆహ్వానము

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం
నవ్య సాహితీ సమితి సంయుక్తాధ్వర్యంలో
శ్రీ త్యాగరాయ గానసభ సౌజన్యంతో

మహాకవి నండూరి రామకృష్ణమాచార్య
శత జయంతి మహోత్సవం

ఆదివారం, 24-10-2021 సా॥ 5-30 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్య అతిథి :
డా॥ కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్. (ఐ.)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు

సభాధ్యక్షులు :
ఆచార్య మాడభూషి శ్రీధరాచార్యులు
పూర్వ కేంద్ర సమాచారశాఖ కమిషనర్
డీన్, న్యాయశాస్త్ర కళాశాల, మహేంద్ర విశ్వవిద్యాలయం

గౌరవ అతిథి :
శ్రీ కళా వి.ఎస్. జనార్ధనమూర్తి
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య వ్యక్తిత్వ విశ్లేషణ :
డా॥ ముక్తేవి భారతి
ప్రముఖ రచయిత్రి
శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి
ప్రముఖ రచయిత్రి

ఆత్మీయ అతిథులు :
శ్రీ కె. సాగరరావు
శ్రీ ఆత్మకూరి గాంధి

ప్రముఖ కవులచే "కవి సమ్మేళనం"

వి. విజయ కుమార్
అధ్యక్షులు
నవ్య సాహితీ సమితి

డా॥ ఆచార్య ఫణీంద్ర
ప్రధాన కార్యదర్శి
నండూరి సాహిత్య పీఠం

ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం అందని ద్రాక్షేనా?.!

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇండియాకు ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో శాశ్విత సభ్యత్వ దీర్ఘకాల అంశం మరోసారి చర్చల్లో నానుతోంది. జో బైడెన్‌తో జరిగిన ప్రత్యేక సమావేశంలో భద్రతామండలి శాశ్వత సభ్యత్వాని ఇండియాకు పూర్తిగా సహకరిస్తామని మోదీకి హామీ ఇచ్చారు. దేశ అగ్రనాయకులు అంతర్జాతీయ పర్యటన జరిపిన ప్రతి సందర్భంలో ఈ విషయం ప్రస్తావనలోకి వస్తున్నది. అమెరికా, చైనా, ఫ్రాన్స్, యుకె, రష్యా అనే 5-దేశాలు శాశ్విత సభ్యత్వాన్ని, 10-దేశాలకు 2-ఏండ్ల తాత్కాలిక సభ్యత్వాన్ని కలిగి ఉంటాయనే విషయం మనకు తెలిసిందే. ప్రస్తుత భద్రమండలి సభ్యదేశాల్లో అభివృద్ధి చెందుతున్న ఒక్క దేశం కూడా లేకపోవడం విచారకరమని, ఈ విషయంలో అధిక జనాభా కలిగిన 2వ దేశంగా, అతి పెద్ద ప్రజాస్వామ్య కేంద్రంగా భారత్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని మెజారిటీ దేశాలు అంగీకరించాయి. పలు అంతర్జాతీయ సంక్షోభ సమయాల్లో 193 సభ్య దేశాలున్న ఐరాసలో ముఖ్య వ్యవస్థాపక సభ్యుడిగా భారత్ అనేక సందర్భాల్లో ఐరాస శాంతి పరిరక్షణ విధుల్లో 2 లక్షల బలగాలను పంపించి విశ్వశాంతి స్థాపనకు సహకరించడం విశేషంగా చెప్పవచ్చు.

అమెరికా గత నలుగురు అధ్యక్షులు జార్జ్ బుష్, బరాక్ ఒబామా, డొనాల్డ్ ట్రంప్, ప్రస్తుత జో బైడెన్‌లు భారత్‌కు భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం కోసం సంఘీభావాన్ని పలు వేదికల్లో తెలుపుతూనే ఉన్నారు. జూన్ 2020లో భారత్‌కు 2-ఏండ్ల కాలపరిమితితో తాత్కాలిక సభ్యత్వం 8వ సారి (1950-51, 1967-68, 1972-73, 1977-78, 1984-85, 1991-92, 2011-12, 2021-22) ఇవ్వబడింది. భద్రతామండలిలోని 4-దేశాలు భారత అభ్యర్థిత్వానికి సమ్మతించినా, చైనా వ్యతిరేకంగా ఉండడంతో 'వీటో పవర్' అడ్డంకులు భారత్‌ను నిలువరిస్తున్నాయి. ఐరాస పలు సందర్భాలలో వివిధ దేశాల నుంచి విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం అంతర్జాతీయ వేదికగా ఐరాస మాత్రమే నిలబడగలిగింది. ప్రస్తుత ఐరాసలో సకారాత్మక సవరణలు చేసి దానిని పటిష్ట పరచాల్సిన అగత్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తమకు అన్ని అర్హతలు ఉన్నాయని ఇండియా సత్వరమే భద్రతామండలిలో సభ్యత్వం కోసం పావులు కదుపుతున్నది. ఇండియాతో పాటు బ్రెజిల్, సౌత్ ఆఫ్రికా, జపాన్, జర్మనీలు కూడా శాశ్వత సభ్యత్వం కోసం ప్రయత్నాలు ప్రారంభించాయి.

1950లో భద్రతామండలి శాశ్వత సభ్యత్వం పొందేందుకు లభించిన అద్భుత అవకాశాన్ని నెహ్రూ చూపిన ఉదార వాదంతో కొల్పోవలసి వచ్చింది. మండలిలో తైవాన్ స్థానానికి బదులు ఇండియాను చేర్చాలన్న వాదనలను నెహ్రూ మృదువుగా తిరస్కరించడమే కాకుండా ఆ స్థానంలో చైనా ఉండాలని త్యాగ గుణం ప్రదర్శించడం, అదే చైనా అగ్రరాజ్యంగా ఎదిగి నేడు భరత్‌ను వ్యతిరేకతతో సభ్యత్వం పొందడం కష్టంగా తోస్తున్నది. దేశాల మధ్య సంఘర్షనలు జరిగినపుడు మధ్యవర్తిత్వం చేయాల్సిన ఐరాస, దాదాపు 80 ఘర్షణల్లో దేశాల మధ్య పోరాటాలు జరగడం చరిత్రలో ఉంది. పలు దేశాలు ఆర్థిక సహాయం చేయకపోవడంతో ప్రస్తుత ఐరాసకు తీవ్ర నిధుల కోరత కూడా ఉన్నది. కరోనా మహమ్మారి విశ్వ కల్లోలంతో పాటు దేశాల మధ్య నెలకొన్న ప్రచ్ఛన్న యుద్ధాలు కూడా ఐరాస జోక్యాన్ని కోరుతున్నాయి. ఐరాస బలపడితేనే ప్రపంచశాంతి వెల్లివిరుస్తుంది. ఐరాసలోనే కాకుండా ప్రపంచ దేశాలల్లో మంచి సంబంధాలు కలిగిన భారత్‌కు అతి త్వరలో భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం రావాలని దేశభక్తిగల భారతీయులుగా కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఒకటో డోజును అందరూ తీసుకున్నందుకు ప్రజలకు అభినందనలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 18 సంవత్సరాల పైబడిన వయో వర్గాని కి చెందిన ప్రజల కు అందరికీ కోవిడ్-19 టీకా మందు తాలూకు ఒకటో డోజు ను తీసుకొన్న దేవభూమి ఉత్తరాఖండ్ లోని ప్రజల కు అభినందన లు తెలిపారు. ఉత్తరాఖండ్ సాధించిన ఈ కార్యసిద్ధి కోవిడ్-19 కి వ్యతిరేకంగా దేశం జరుపుతున్న పోరాటం లో అతి ముఖ్యమైందని కూడా ప్రధాన మంత్రి అన్నారు.

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింహ్ ధమి పొందు పరచిన ఒక ట్వీట్ కు, ప్రధాన మంత్రి ప్రత్యుత్తరమిస్తూ;

"దేవభూమి ప్రజల కు చాలా చాలా శుభాకాంక్షలు. కోవిడ్ కు వ్యతిరేకం గా దేశం సాధిస్తున్న పోరాటం లో ఉత్తరాఖండ్ యొక్క ఈ కార్యసిద్ధి అత్యంత మహత్వ పూర్వమైనటువంటిది గా ఉంది. విశ్వమారి తో పోరాడటం లో మన టీకాకరణ కార్యక్రమం అన్నింటి కంటే ఎక్కువ ప్రభావాన్ని ప్రసరించేది గా నిరూపణ కానుందని నాకు విశ్వాసం ఉంది. మరి దీనిలో ప్రతి ఒక్క వ్యక్తి తాలూకు భాగస్వామ్యానికి అగ్రతాంబూలం ఉంది" అని పేర్కొన్నారు.

కేరళలో భారీ వర్షాలు కురవడం, కొండచరియలు విరిగి పడడంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తో మాట్లాడిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:కేరళ లో భారీ వర్షాలు కురవడం, కొండచరియ లు విరిగి పడడం తో ప్రాణనష్టం సంభవించడం పట్ల సంతాపాన్ని వ్యక్తం చేసిన ప్రధాన మంత్రి

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కేరళ ముఖ్యమంత్రి శ్రీ పినరాయి విజయన్ తో మాట్లాడారు. కేరళ లో భారీ వర్షాలు కురిసి, కొండచరియ లు విరిగిపడ్డ కారణం గా ఏర్పడ్డ స్థితి ని గురించి చర్చించారు. కేరళ లో భారీ వర్షాలు, కొండచరియ లు విరిగిపడినందువల్ల ప్రాణనష్టం సంభవించడం పట్ల ప్రధాన మంత్రి తీవ్ర విచారాన్ని కూడా వ్యక్తం చేశారు.

"కేరళ ముఖ్యమంత్రి శ్రీ ఏలతీజీఎజీనిజూతినిజీతీజీఎతి తో మాట్లాడాను; కేరళ లో భారీ వర్షాల తో పాటు కొండచరియలు విరిగిపడిన ఫలితం గా తలెత్తిన స్థితి ని గురించి చర్చించాను. గాయపడ్డ, బాధిత వ్యక్తుల కు సాయపడడానికి అధికారులు కృషి చేస్తున్నారు. అందరి సురక్ష కోసం, ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం నేను ఆ ఈశ్వరుడి ని ప్రార్థిస్తున్నాను.

కేరళ లో భారీ వర్షాల వల్ల, కొండచరియలు విరిగిపడినందువల్ల కొంత మంది చనిపోవడం దు:ఖదాయకం. ఆప్తుల ను కోల్పోయిన కుటుంబాల కు ఇదే సంతాపం." అని పేర్కొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్, వ్యర్థాల నిర్వహణ యాజమాన్య రంగంలో ఉన్న రెండు సంస్థలపై దాడులు నిర్వహించిన ఆదాయం పన్ను అధికారులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:డిజిటల్ మార్కెటింగ్, ప్రచార కార్యక్రమాల రంగంలో ఉన్న ఒక సంస్థకి బెంగళూరు, సూరత్, చండిగార్, మొహాలిలలో ఉన్న కార్యాలయాలపై అధికారులు దాడులు చేసి సోదాలు నిర్వహించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ ను నియమించి సంస్థ అక్రమ మార్గాల్లో వసతి నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని సోదాలలో అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించిన సాక్ష్యాధారాలను అధికారులు సేకరించారు. సంస్థకి చెందిన నగదు, అక్రమ ఆదాయాన్ని హవాలా ఆపరేటర్ల ద్వారా తరలించడానికి తాను సహకరించినట్లు ఆపరేటర్ అంగీకరించాడు.

సంస్థ ఖర్చులను ఎక్కువ చేసి చూపడం, ఆదాయాన్ని తగ్గించి చూపడం చేసిందని కూడా అధికారులు గుర్తించారు.లెక్కల్లో చూపకుండా సంస్థ నగదు చెల్లింపులను చేసిందని వెల్లడయింది. డైరెక్టర్ల వ్యక్తిగత ఖర్చులను వ్యాపార ఖర్చులుగా లెక్కల్లో చూపించారు. సంస్థ డైరెక్టర్లు వారి కుటుంబ సభ్యులు ఉపయోగిస్తున్న విలాసవంతమైన వాహనాలను సంస్థ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్ పేర్ల మీద కొనుగోలు చేసినట్టు అధికారులు గుర్తించారు.

ఆదాయం పన్ను శాఖ అధికారులు దాడులు చేసిన రెండవ సంస్థ వ్యర్థాల నిర్వహణా రంగంలో కార్యకలాపాలను సాగిస్తోంది. వివిధ మునిసిపాలిటీల్లో వ్యర్థాల సేకరణ, రవాణా, శుద్ధి, తొలగింపు కార్యక్రమాలను ఈ సంస్థ నిర్వహిస్తున్నది.

ఆదాయం పన్ను శాఖ అధికారాలు నిర్వహించిన సోదాలలో వివిధ అక్రమాలకు సంబంధించిన పత్రాలు, కాగితాలు, డిజిటల్ సాక్ష్యాలు లభ్యమయ్యాయి. ఖర్చులు, సబ్ కాంట్రాక్టుల అంశంలో సంస్థ తప్పుడు బిల్లులను సృష్టించినట్టు అధికారులు గుర్తించారు. 70 కోట్ల రూపాయల విలువ చేసే తప్పుడు బిల్లులను సంస్థ సృష్టించి సంస్థ అక్రమాలకు పాల్పడినట్టు అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడయింది.

లెక్కలు చూపని దాదాపు ఏడు కోట్ల రూపాయల విలువ చేసే సంస్థ పెట్టుబడులను అధికారులు గుర్తించారు. వీటితో పాటు అధికారులు లెక్కలు చూపని 1.95 కోట్ల రూపాయల నగదు, 65 లక్షల రూపాయల విలువ చేసే ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

గురుకులాలు ఎందుకు ఓపెన్ చేయడం లేదన్న బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:తెలంగాణ ప్రభుత్వం గురుకుల విద్యార్థులను కూలీలుగా మార్చేలా వ్యవహరిస్తోందని మాజీ ఐపీఎస్ అధికారి, బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్విట్టర్‌లో విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలను రీ ఓపెన్ చేసినా. రెసిడెన్షియల్స్ విషయంలో సర్కారు ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఆయన విమర్శలు ఎక్కుపెట్టారు. లక్షలాది పేద విద్యార్థులు చదువుకునే గురుకులాలు, హాస్టళ్ల పునఃప్రారంభంపై కేసీఆర్ మౌనం ఒక తరాన్ని కూలీలుగా మార్చే కుట్రని ప్రవీణ్ కుమార్ దుయ్యబట్టారు.

ఇలాంటి వైఖరితో పిల్లలు భూస్వాముల ఇళ్లు, భూముల్లో కూలీలుగా మారే ప్రమాదం ఉందన్నారు. గడీల పాలన నుంచి తెలంగాణ తల్లిని విముక్తి చేయాలంటూ ట్విట్టర్‌లో పిలుపునిచ్చారు. 'లక్షలాది పేద విద్యార్థులు చదువుతున్న గురుకులాలు, హాస్టళ్లను పునఃప్రారంభించడంపై కేసీఆర్ ప్రభుత్వం మౌనం మళ్లీ ఒక తరాన్ని భూస్వాముల భూముల్లో కూలీలుగా, ఇళ్లలో పనిచేసే పనిపిల్లలుగా మార్చే కుట్ర తప్ప మరొకటికాదు.. గడీల పాలన నుంచి తల్లి తెలంగాణను విముక్తి చేయవలసిన సమయం ఆసన్నమైంది' అని ట్వీట్ చేశారు.

హుజురాబాద్ ఉప ఎన్నిక నేపథ్యంలో

బహుముఖవ్యూహంతో ముందుకుసాగుతున్న కరీంనగర్ కమీషనరేట్ పోలీసులు

కరీంనగర్ అక్టోబర్ 18:(నేటినిజం ప్రతినిధి): హుజురాబాద్ ఉప ఎన్నిక నేపథ్యంలో కరీంనగర్ కమీషనరేట్ పోలీసులు బహుముఖవ్యూహంతో ముందుకుసాగుతున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు, మద్యం, ఇతరత్రా వస్తువులను ఏమార్గంలో నైనా తరలించే అవకాశాలు ఉండటంతో ప్రతినిత్యం తనిఖీలను ముమ్మరంగా కొనసాగించడం, కరోనా నియమ నిబంధనలు వివిధ కార్యక్రమాల సందర్భంగా ఆచరిస్తున్నారా?లేదా? అనే అంశాన్ని ప్రత్యేకంగా పరిశీంచడం, ప్రతినిత్యం కొనసాగుతున్న తనిఖీలను మరింత ముమ్మరం చేయడం కోసం ప్రత్యేక పోలీసు బలగాలను రంగంలోకి దించారు. ఎలాంటి సందర్భాలు ఉత్పన్నమయినా విధుల్లో ఉన్న పోలీసులు సంయమనం పాటించేలా చర్యలు తీసుకోవడం, అన్నిస్థాయిలకు చెందిన పోలీసుల ఆరోగ్యానికి ప్రాధన్యతనిస్తూ పైన పేర్కొన్న చర్యలను కొనసాగిస్తున్నారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బులు, మద్యం, ఇతరత్రా వస్తువులు పంపిణీ చర్యలను పూర్తిగా నియంత్రించడం కోసం ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక పోలీసులతోపాటు కేంద్రబలగాలు కూడా రంగంలోకి దిగడంతో అన్నిరకాల అక్రమ కార్యకలాపాలను పూర్తిగా నియంత్రించేందుకు పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న డబ్బులు, మద్యం, ఇతరత్రా వస్తువుల స్వాధీనం చేసుకున్నా రెండు,మూడురెట్ల స్థాయిలో పెంచాలని, ఇందుకోసం రేయింబవళ్ళు అప్రమత్తంగా ఉంటూ తనిఖీలను నిర్వహించాలని పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ అన్నిస్థాయిలకు చెందిన పోలీసులను ఆదేశించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులు కరోనా, ఇతర అనారోగ్యానికి గురవ్వకుండా వివిధ రకాల మందులను పంపిణీ చేస్తున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బులు, మద్యం, ఇతర రకాల వస్తువులను ఎక్కడైనా దాచిఉంచారా? అనే సమాచారం ఆరా తీయడం కోసం టాస్క్‌ఫోర్స్, స్పెషల్‌బ్రాంచిలతోపాటు ఇతర విభాగాలకు చెందిన పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ఎన్నికల నియమావళిని ఉల్లఘించే వారిపై కేసుల నమోదు

ఎన్నికల పరిశీలకులు ఎప్పుడు సమాచారం అడిగినా వెంటనే సమాచారం అందించే విధంగా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. కోవిడ్ నియమ నిబంధనలు, ఎన్నికల నియమావళిని ఉల్లఘించే వారిపై కేసులను నమోదు చేస్తున్నారు. గతంలో జరిగిన ఎన్నికల సందర్భంగా అల్లర్లు జరిగేందుకు కారకులైన వారిని సంబంధిత తహసిల్దార్‌ల ఎదుట బైండోవర్లు చేయిస్తున్న వర్వం ప్రతిరోజు కొనసాగుతున్నది. ఉప ఎన్నిక నేపథ్యంలో తెలంగాణరాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల దృష్టి ఇక్కడే ఉందని, ఎలాంటి అవాంఛనీయ, అక్రమ కార్యకలాపాలు జరుగకుండా పగడ్బందీ చర్యలను తీసుకుంటున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ కమీషనర్ ప్రతిరోజు పర్యటించడంతోపాటుగా కళాబృందాలు,

ఇతర పోలీసు అధికారులతో కోవిడ్ నియమ నిబంధనలు, ఎన్నికల నియమావళి, అల్లర్లకు పాల్పడేందుకు ఏమాత్రం ప్రయతించినా తీసుకునబడే చట్టపరమైన చర్యల గురించి అవగాహన కల్పిస్తున్నారు. హుజురాబాద్ ఉప ఎన్నికను ఒక సున్నితమైన అంశంగా పరిగణిస్తూ పోలీస్‌శాక పగడ్బందీ చర్యలను అమలు చేస్తోంది.

ఆత్మీయత, గౌరవం, ప్రేమాభిమానాల సంగమమే అలయ్-బలయ్- ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన భారతదేశం వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు, అచార వ్యవహారాలకు ప్రతీక అని... అందులో ఆత్మీయత, గౌరవం, ప్రేమాభిమానాల సంగమమే అలయ్-బలయ్ కార్యక్రమం అని గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు గారు తెలిపారు. హర్యానా గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ గారు హైదరాబాద్ నక్లెస్ రోడ్ లోని జల్ విహార్ లో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు ఆచార వ్యవహారాలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఉత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు.

వేలకొలదీ విదేశీ దండయాత్రలు, మరెన్నో కుట్రలు జరిగినప్పటికీ, ఎన్నో నాగరికతలు కాలగర్భంలో కలసిపోయినా, భారతదేశానికే ప్రత్యేకమైన అస్తిత్వం ఇంకా నిలబడి ఉండడానికి కారణం మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణేనన్న ఉపరాష్ట్రపతి, అలయ్ ? బలయ్ కూడా అలాంటి కార్యక్రమమేనని తెలిపారు.

స్వరాజ్య ఉద్యమ సమయంలో ప్రజలందరినీ ఏకం చేసేందుకు వినాయక చవితి ఉత్సవాలకు పిలుపునిచ్చిన శ్రీ బాలగంగాధర్ తిలక్ గారిని గుర్తు చేసుకున్న ఉపరాష్ట్రపతి, అదే స్ఫూర్తితో ప్రజలందరిలో ఏకతా భావాన్ని నింపేందుకు కోవిడ్ సమయాన్ని మినహాయిస్తే 13 ఏళ్ళుగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న హర్యానా గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ గారికి అభినందనలు తెలిపారు.

సమాజాన్ని కుల, ప్రాంత, వర్గాలకు అతీతంగా ఒకచోట చేర్చగలిగే శక్తి సంస్కృతికి ఉందన్న ఉపరాష్ట్రపతి, గతమే గాక వర్తమాన, భవిష్యత్తుల్లోనూ సమాజాన్ని ఏకం చేసేది సంస్కృతే అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ప్రజలంతా ఒకే చోటకు చేరి మంచి ఆలోచనలు పంచుకున్నప్పుడు ఏదైనా సాధించేందుకు వీలు పడుతుందని, తోటి వారిని ఎలా గౌరవించుకోవాలో అలయ్ బలయ్ లాంటి కార్యక్రమాలు తెలియజేస్తాయన్నారు.

స్వరాజ్య ఉద్యమ సమయంలో సంస్కృతిని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు జరిగినా ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నాటి మహనీయులు ఆచార వ్యవహారాలను కాపాడుకుని, మనకు అందజేశారని, వారి త్యాగాల ద్వారా మనకు అందిన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ.. మన అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఉపరాష్ట్రపతి సూచించారు. సాంస్కృతిక పునరుజ్జీవనం మనందరి బాధ్యతని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ గవర్నర్ శ్రీమతి తమిళిసై సౌందరరాజన్, హర్యానా గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శ్రీ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖామాత్యులు శ్రీ జి. కిషన్ రెడ్డి, తెలంగాణ హోం శాఖ మంత్రి శ్రీ మహమ్మద్ మహమూద్ అలీ, సినీనటుడు, జనసేన అధినేత శ్రీ పవన్ కల్యాణ్, ప్రముఖ వైద్యులు శ్రీ నాగేశ్వర రెడ్డి, రెడ్డి ల్యాబ్స్ అధినేత శ్రీ సతీష్ రెడ్డి, భారత్ బయోటెక్ వ్యవస్థాపకులు శ్రీ కృష్ణ యెల్లా, బయోలాజికల్-ఈ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి మహిమా దత్లా, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రధాన ఓడరేవుల చరిత్రలో మొట్టమొదటిసారిగా, ఎల్.పి.జి. షిప్-టు-షిప్ ఆపరేషన్ చేపట్టిన - శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:రివర్ ఛానల్ లోకి సరకును పరిమితం చేయడంతో, కలకత్తా లోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఓడరేవు (గతంలో కోల్‌కతా పోర్ట్ ట్రస్ట్) యొక్క హల్దియా డాక్ కాంప్లెక్స్ (హెచ్.డి.సి) లేదా కోల్‌కతా డాక్ సిస్టమ్ (కే.డి.ఎస్) లో సరకును లోడ్ చేయడానికి ముందు పొరుగున ఉన్న ఓడరేవులలో సరకును దింపు కోవలసిన అవసరం ఉంది. రెండు పోర్టు లలో సరకు దింపుకోవలసి రావడంతో, ఓడల్లో సరుకు ఎక్కువ కాలం ఉండడంతో పాటు, రవాణాకు అదనపు సమయం పడుతోంది. అంతర్గతంగా వచ్చే అడ్డంకులను తొలగించడానికి, సాగర్, శాండ్‌హెడ్స్ మరియు ఎక్స్ పాయింట్ సమీపంలోనే ఉన్న పెద్ద నౌకల దగ్గరకు కేప్ సైజ్ లేదా బేబీ కేప్ చిన్న నౌకలను తీసుకురావడంతో పాటు, నీటిలో తేలియాడే క్రేన్లు లేదా నౌకలమీద ఉండే క్రేన్ ల వినియోగం ద్వారా పూర్తిగా నిండిన డ్రై బల్క్ నౌకల నిర్వహణకు వీలుగా, దిగుమతి దారులకు అవకాశాలను కల్పించేందుకు, ఎస్.ఎం.పి., కోల్‌కతా, ప్రయత్నించింది.

పెద్ద ఓడల నుండి చిన్న ఓడల్లోకి సరకును మార్చే పాయింట్ల వద్ద, గత కొన్నేళ్ళుగా పెద్ద సంఖ్యలో డ్రై బల్క్ నౌకలను వినియోగిం చడం జరిగింది.

బి.పి.సి.ఎల్., ఐ.ఓ.సి.ఎల్., హెచ్.పి.సి.ఎల్. వంటి చమురు తయారీ కంపెనీల సీనియర్ యాజమాన్యాలతో పాటు, ఎల్.పి.జి., ఇతర ద్రవ ఇంధన ఉత్పత్తులకు చెందిన ప్రముఖ ప్రైవేట్ దిగుమతిదారుల తో అనేక చర్చలు జరిపి, ఎస్.పి.ఎం., కోల్‌కతాలోని డీప్ డ్రాఫ్ట్ యాంకరేజ్ పాయింట్ల వద్ద ఎల్.పి.జి. / ద్రవ ఇంధనం రవాణా కు సంబంధించి ఓడ-నుండి-ఓడ లోకి మార్చే (ఎస్.టి.ఎస్) సౌకర్యాన్ని పొడిగించడం ద్వారా పొందగల అంతర్గత ప్రయోజనాల గురించి తెలియజేయడం జరిగింది. ఒకే పోర్ట్ లో రవాణా కార్యకలాపాలు చేపట్టడంవల్ల హల్దియాలో డ్రాఫ్ట్ పరిమితిని అధిగమించడమే కాకుండా మిగిలిపోయిన సరుకును సత్వరమే రవాణా చేయడంతో పాటు ఎక్కువ సరుకును సమికరించడంలో సహాయపడుతుంది, తద్వారా యూనిట్ ఖర్చులను తగ్గించవచ్చు.

పూర్తిగా నిండిన నౌకలను నిర్వహించడానికి దాని పరిమితుల్లోని ఎల్.పి.జి. కి చెందిన ఎస్.టి.ఎస్. కార్యకలాపాలను అన్వేషించడానికి, హెచ్.డి.సి., ఎస్.ఎమ్.పి., కోల్‌కతా, మార్గదర్శక చొరవ తీసుకోవడంతో పాటు, అలాంటి కార్యకలాపాలను అనుమతించవలసిందిగా, కస్టమ్స్ అధికారులను అభ్యర్థించింది. కస్టమ్స్ అధికారులతో ఇదే విషయమై సంప్రదించడం జరిగింది.

వారు దయతో, ఈ అభ్య ర్థనను పరిగణనలోకి తీసుకుని, 26.04. 2021 నుండి ఈ ఎస్.టి.ఎస్. కార్యకలాపా లను అనుమతించి అవసరమైన ఆదేశాలను జారీ చేశారు. అదేవిధంగా, చిన్న ఓడల ద్వారా పెద్ద ఓడలోకి సరకు ఎక్కించే సాధారణ కార్యకలాపాలను ప్రోత్సహించ డానికి, నౌక మరియు సరుకు సంబంధిత ఛార్జీల పరంగా ఎస్.ఎం.పి. కోల్‌కతా, గణనీయమైన తగ్గింపులను ప్రకటించింది.

శాండ్‌హెడ్స్ వద్ద ఎస్.టి.ఎస్. కార్యకలా పాల కోసం పోర్ట్ ప్రత్యేకంగా టగ్ హైర్ ఛార్జీలలో కూడా అదనపు రాయితీ ప్రకటించింది.

ఈ మార్గదర్శకమైన ఈ చొరవ ఫలితంగా, భారతీయ తీరంలో ఎల్.పి.జి. మొట్టమొదటి ఎస్.టి.ఎస్. కార్యకలాపాలు బి.పి.సి.ఎల్. ద్వారా 15 అక్టోబర్, 2021 తేదీన జరిగాయి.

బి.పి.సి.ఎల్. ఆఫ్-షోర్ ఎస్.టి.ఎస్. ప్రదేశంలో సర్వీస్ ప్రొవైడర్ గా నియమించబడ్డ ఫెండర్-కేర్-మెరైన్ అనే సంస్థ సేవలు అందిస్తోంది.

ద్రవ ఇంధన రవాణా కు సంబంధించిన ఎస్.టి.ఎస్. కార్యకలాపాలలో పేరుపొందిన ఫెండర్-కేర్-మెరైన్-ఒమేగా సంస్థ, లాజిస్టిక్స్ సేవలను అందిస్తోంది.

ఎస్.టి.ఎ స్. ప్రాంగణంలో నౌకను బెర్తింగ్ చేయడా నికి ఉపయోగించే పడవలతో పాటు, లాగ దానికి / నిలిపి ఉంచడానికి పెద్ద పరిణా మంలో ఉండే యోకోహామా రక్షణ సామాగ్రిని ఎన్.ఎమ్.పి., కోల్‌కతా అందిస్తోంది. 44551 మెట్రిక్ టన్నుల రవాణా సరకుతో ఉన్న ప్రధాన నౌక ఎం.టి. యుషన్, శాండ్-హెడ్స్ వద్ద చిన్న నౌక ఎం.టి. హ్యాంప్- షైర్ తో ఎస్.టి.ఎస్. కార్యకలాపాలు నిర్వహించింది.

సరకు బదిలీ చేసే కార్యక్రమం 15.10.2021 తేదీ మధ్యాహ్నం 12.48 గంటలకు ప్రారంభమై, 16.10.2021 తేదీ ఉదయం 06.06 గంటలకు పూర్తయ్యింది. ఆ విధంగా, దాదాపు 17 గంటల స్వల్ప వ్యవధిలో, 23,051 మెట్రిక్ టన్నుల సరుకును ప్రధాన నౌక నుండి చిన్న నౌకకు బదిలీ చేయడం జరిగింది.

బి.పి.సి.ఎల్. కోసం ఈ ఎస్.టి.సి. కార్యకలాపాలు గతంలో మాలే వద్ద జరిగేవి. కాగా, ఇప్పుడు, ఈ ఎస్.టి.సి. కార్యకలాపాలను హెచ్.డి.సి. వద్ద చేయడం వల్ల, బి.పి.సి.ఎల్. కి విలువైన విదేశీ మారకం ఆదా అయ్యింది.

హెచ్.డి.సి. వద్ద నిర్వహించిన ఈ ఎస్.టి.ఎస్. కార్యకలాపాలు, బి.పి.సి.ఎల్. కు చెందిన ఇతర ప్రదేశాల్లో, ఇవే, కార్యకలాపాలు నిర్వహించడానికి చిన్న నౌక తీసుకునే 7 నుండి 9 రోజుల సమయాన్ని తగ్గిస్తాయి.

ఫలితంగా, బి.పి.సి.ఎల్. సంస్థకు ప్రతి నౌక ప్రయాణం మీద దాదాపు 3,50,000 అమెరికా డాలర్ల మేర ఖర్చు ఆదా అవుతుంది.

ఇప్పటికిప్పుడు ప్రారంభమైన ఈ ఎస్.టి.ఎస్. కార్యకలాపాలు దేశంలోని పురాతన నదీ తీరభారీ నౌకాశ్రయానికి కొత్త వ్యాపార సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు, విదేశీ మారకద్రవ్యాన్ని గణనీయంగా ఆదా చేసే విషయంలో వాణిజ్యం మరియు దేశం మొత్తానికి ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు.

ఆ విధంగా, ఎన్. ఎమ్.పి., కోల్‌కతాలో చేపడుతున్న ఎస్.టి. ఎస్. కార్యకలాపాలు, భారతీయ తీరంలో దిగుమతి చేసుకున్న ఎల్.పి.జి. నిర్వహణలో మొత్తం ఆర్థిక వ్యవస్థను మార్చివేసే ప్రక్రియగా ఎదిగే అవకాశం ఉంది.

బొగ్గు ఉత్పత్తిపై సింగరేణి దృష్టి

హైదరాబాద్ , అక్టోబర్ 18:దేశవ్యాప్తంగా విద్యుత్ కేంద్రాలలో బొగ్గు నిల్వలు తగ్గిపోవడంతో సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి రవాణా పై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ ఐ.ఎ.ఎస్ సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలో లభిస్తున్న బొగ్గు ఉత్పత్తి నిలువలు రవాణా సౌకర్యాల గురించి చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా బొగ్గు కు డిమాండ్ ఉన్నందున రోజువారి లక్ష్యాన్ని మించి బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్, శ్రీరాంపూర్ ఏరియా గనుల ఏజెంట్లు, శ్రీరాంపూర్

టీఆర్ఎస్ అధ్యక్షుడిగా కేసీఆర్ ఉండాలి: మహిళా ప్రజాప్రతినిధులు

హైదరాబాద్ , అక్టోబర్ 18:టీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. పార్టీ అధ్యక్ష పదవికి ఈసారి కేసీఆరే ఉండాలని ఆయన పేరును ప్రతిపాదిస్తూ మహిళా ప్రజాప్రతినిధులు నామినేషన్ దాఖలు చేశారు. మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, హరిప్రియా నాయక్, రేఖానాయక్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణితో పాటు తదితరులు నామినేషన్ దాఖలు చేశారు.

కేశినేని భవన్‌లో చంద్రబాబు ఫొటో తొలగింపు.. నాని పార్టీ మారుతారా?

అమరావతి, అక్టోబర్ 18:విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని నాని వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆయన బీజేపీలో చేరబోతున్నారని ప్రచారం జోరుగా జరుగుతోంది. విజయవాడలోని కేశినేని భవన్ లో టీడీపీ అధినేత చంద్రబాబు ఫొటోను తొలగించడం.. ఈ ప్రచారాన్ని బలం చేకూరుస్తుంది. చంద్రబాబు ఫొటోలతో పాటుగా టీడీపీ నేతల ఫొటోలను కూడా తొలగించారు. గ్రౌండ్ ఫ్లోర్, ఆఫీసు లోపల ఉన్న పార్టీ నేతల ఫ్లెక్సీలను సిబ్బంది తొలగించారు. అయితే, నేతల ఫొటోల స్థానంలో రతన్ టాటా ఫొటోలను ఉంచారు. దీంతో కేశినేని నాని బీజేపీలోకి చేరబోతున్నారంటూ ఊహాగానాలు మొదలైయ్యాయి.

గత కొద్ది రోజులుగా పార్టీ కార్యక్రమాలకు కేశినేని నాని దూరంగా ఉంటున్నారు. అంతే కాదు 2024 ఎన్నికలకు దూరంగా ఉంటానని ఇప్పటికే ఆయన ప్రకటించారు. విజయవాడలోని టీడీపీ నేతలతో విభేదాల కారణంగా ఆయన పార్టీని వీడాలని భావిస్తున్నట్లు అంతా భావిస్తున్నారు. అయితే, పార్టీ మార్పు విషయంపై కేశినేని నాని ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.మరోవైపు నానికిపార్టీ మారే ఆలోచన లేదని స్థానిక టీడీపీ నేతలు అంటున్నారు. కేశినేని నాని బీజేపీలో చేరబోతున్నారనే వార్తలపై విజయవాడ టీడీపీ నేత ఫతావుల్లా ఖండించారు. కేశినేని భవన్ లో చంద్రబాబు ఫొటో తొలగింపు వెనుక ఉన్న కారణాన్ని వెల్లడించారు. కేశినేని భవన్ లో ఒక ఛాంబర్ లో మాత్రమే చంద్రబాబు ఫొటోను మర్చారని, ఆఫీసు బయట, లోపల మిగతా గదుల్లోనూ చంద్రబాబు, ఎన్టీఆర్ ఫొటోలు యథావిధిగా ఉన్నాయని ఫతావుల్లా స్పష్టం చేశారు. చంద్రబాబుతోపాటు ఇతర నేతల ఫ్లెక్సీలు అలాగే ఉన్నాయని చెప్పారు. మొత్తం మీద కేశినేని నాని అంశం ఇప్పుడు ఏపీ రాజకీయాలను వేడెక్కించాయి.

సీడబ్ల్యూసీ భేటీలో సర్దార్ పటేల్‌ను అవమానించారు: బీజేపీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: ఇటీవల సోనియా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. అయితే ఆ భేటీలో సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను అవమానించినట్లు బీజేపీ ఆరోపించింది. ఆ పార్టీ ప్రతినిధి సంబిత్ పాత్ర ఇవాళ మీడియాతో మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్ విలీన అంశంలో సర్దార్ పటేల్‌ను కాంగ్రెస్ తప్పుగా చిత్రీకరించిందని ఆయన అన్నారు. వార్తాపత్రికల్లో వచ్చిన అంశాలను ప్రస్తావిస్తూ.. సీడబ్ల్యూసీ సభ్యుడు తారిక్ హమీద్ కర్రా తప్పుడు అభిప్రాయాలు వెల్లడించినట్లు సంబిత్ పాత్ర తెలిపారు. భారత్ నుంచి జమ్మూకశ్మీర్‌ను వేరు చేసేందుకు సర్దార్ పటేల్ ప్రయత్నించారని, కానీ నెహ్రూ ఆ ప్రాంతాన్ని ఇండియాలో కలిపేందుకు ప్రయత్నించినట్లు తారిక్ సీడబ్ల్యూసీ సమావేశంలో అన్నారని బీజేపీ నేత ఆరోపించారు. కశ్మీర్‌ను ఇండియా నుంచి విడదీసేందుకు జిన్నాతో కలిసి సర్దార్ చేతులు కలిపినట్లు తారిక్ చెప్పారని బీజేపీ నేత అన్నారు. తారిక్ చేసిన ఆ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు అభ్యంతరం వ్యక్తం చేశారా అని సంబిత్ పాత్ర ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తారిక్‌ను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత - ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:ప్రకృతిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇందుకోసం ముఖ్యంగా యువతరం కంకణబద్ధులై ముందుకు కదలాల్సిన అవసరం ఉందని గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని దసపల్లా హోటల్ లో ఎమెస్కో బుక్స్ వారు ప్రచురించిన నర్సరీ రాజ్యానికి రారాజు ? పల్ల వెంకన్న పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ పల్ల వెంకన్న గారి కుటుంబ సభ్యులకు, ప్రచురణ కర్తలకు, పుస్తక రచయిత శ్రీ వల్లీశ్వర్ గారికి ఉపరాష్ట్రపతి అభినందనలు తెలియజేశారు.

శ్రీ పల్ల వెంకన్న గారి శక్తి అసాధారణమైనదని, దాని వెనుక ఉన్నది ప్రకృతేనని భావిస్తానన్న ఉపరాష్ట్రపతి, వారు పుస్తకాల్ని చదవకపోయినా మొక్కలను చదివారని, వాటితో మమేకమై ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. ఐదోతరగతి వరకే చదువుకున్నా, శరీరం పూర్తిగా సహకరించని పరిస్థితుల్లో ఉన్నా ప్రకృతి విజ్ఞానాన్ని ఔపోసన పట్టి, కార్యదీక్ష, అనుభవంతో వృక్ష శాస్త్రవేత్తలకు సైతం సూచనలు ఇచ్చే స్థాయికి ఎదిగారని తెలిపారు.

వేగంగా పట్టణీకరణ జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విచ్చలవిడిగా చెట్టు కొట్టేయడం వల్ల భూతాపం విపరీతంగా పెరిగిపోతోందన్న ఉపరాష్ట్రపతి, పర్యావరణ అసమతౌల్యత ప్రకృతి విపత్తులకు కారణం అవుతోందని తెలిపారు. అభివృద్ధి చెందాలన్న ప్రయత్నంలో ప్రకృతిని ధ్వంసం చేసుకుంటున్నామనే విషయాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని, పర్యావరణం ? ప్రగతిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమౌతుందని తెలిపారు. ప్రకృతి పరిరక్షణ ప్రజా ఉద్యమంగా రూపు దాల్చాల్సిన అవసరం ఉందన్న ఆయన, ఈ మహాయజ్ఞంలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కష్టపడి, కష్టాన్ని ఇష్టపడి పని చేయడమే జీవితంలో ఎదిగే మార్గమన్న ఉపరాష్ట్రపతి శ్రీ పల్ల వెంకన్న గారు తమ దివ్యాంగత్వాన్ని కూడా లెక్క చేయకుండా ఎంతో కష్టపడ్డారని, ఆ నిబద్ధతే అర ఎకరా నర్సరీని 40 నుంచి 50 ఏళ్ళలో వందెకరాల స్థాయికి చేర్చిందని తెలిపారు. దేశమంతా తిరిగి దాదాపు మూడువేల రకాల మొక్కల్ని సేకరించి నర్సరీని అభివృద్ధి చేసిన శ్రీ వెంకన్న, ప్రతి ఇంట్లో పచ్చదనాన్ని పెంచడం ద్వారా దేశమంతా పచ్చదనాన్ని పెంచవచ్చని ఆకాంక్షించారని తెలిపారు. వ్యాపారదృష్టితోనే కాక, దేశ ప్రయోజనాల దృష్టితోనూ పని చేసిన ఆయన దేశభక్తి ముందుతరాలకు ఆదర్శనీయమని పేర్కొన్నారు.

పాఠశాలలు, దేవాలయాలు, ధార్మిక సంస్థలకు ఉచితంగా మొక్కలు అందజేయడం, ఆరోగ్యశిబిరాల నిర్వహణ, పేద విద్యార్థులకు పుస్తకాల వితరణ వంటి పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ సేవలను అభినందించిన ఉపరాష్ట్రపతి, ఓ ఆలయాన్ని సైతం నిర్మించి ఆధ్యాత్మిక స్ఫూర్తిని పంచడం ముదావహమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛభారత్ ఉద్యమానికి అనుగుణంగా అదే స్ఫూర్తి గ్రీన్ భారత్ ఉద్యమానికి అంకితమైన శ్రీ పల్ల వెంకన్న నర్సరరీల విస్తరణను ప్రోత్సహించారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు నర్సరీ శిక్షణనిచ్చి పల్లె ప్రగతిని ఆకాంక్షించారన్నారు.

జీవితంలో ఓ స్థాయికి ఎదగడం పెద్ద విషయం కాదని, దాన్ని జీవితాంతం నిలబెట్టుకోవడమే కత్తిమీద సాము అన్న ఉపరాష్ట్రపతి, నాణ్యతలో రాజీ పడని తత్వమే శ్రీ పల్ల వెంకన్నను నిలబెట్టిందని తెలిపారు. 'ట్రెండ్ సెట్టర్ ఆఫ్ నర్సరీ ఇన్ ఇండియా' సహా అనేక జాతీయ, ప్రాంతీయ అవార్డులు, పురస్కారాలు వారి అంకిత భావానికి, సాధించిన విజయాలకు దర్పణం పడతాయన్న ఆయన, చేసేపని పట్ల నిబద్ధత, కష్టపడి పని చేసే మనస్తత్వం, చేసే వృత్తిపట్ల అనురక్తి... ఇలాంటివే వారిని ఉన్నత స్థాయికి చేర్చాయన్నారు.

ప్రకృతిని ప్రేమించిన శ్రీ పల్లా వెంకన్న గారి స్ఫూర్తిని యువతకు చేరవేసేందుకు వారి కుటుంబ సభ్యులు నడుం బిగించాలని సూచించిన ఉపరాష్ట్రపతి, పచ్చదనం ? పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలతో కలిసి పని చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా హరితహారం పేరిట మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకుపోతున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపిన ఆయన, పాఠశాల స్థాయి నుంచి పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం పట్ల పిల్లలకు అవగాహన పెంచేందుకు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హోంమంత్రి శ్రీ మహమూద్ అలీ, పూర్వ పార్లమెంట్ సభ్యులు శ్రీ ఉండవల్లి అరుణ్ కుమార్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డా. బి.వి.పట్టాభిరామ్, ఎమెస్కో బుక్స్ సి.ఈ.ఓ. శ్రీ విజయకుమార్, ప్రముఖ పాత్రికేయులు శ్రీ కె.రామచంద్రమూర్తి, రైతునేస్తం వ్యవస్థాపకులు శ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, పుస్తక రచయిత శ్రీ వల్లీశ్వర్, శ్రీ పల్ల వెంకన్న గారి కుటుంబ సభ్యులు సహా దేశవ్యాప్తంగా పలు నర్సరీల యజమానులు, నర్సరీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాకారులను, సంప్రదాయ కళలను బలోపేతం చేయడానికి వారణాసిలో ఖాదీ కారిగార్ సమ్మేళన్ పేరుతో ఖాదీ ప్రదర్శన ప్రారంభమైంది...

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:ఉత్తరప్రదేశ్ నగరం వారణాసిలో 20 భారతీయ రాష్ట్రాల హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శించే అత్యాధునిక ఖాదీ ప్రదర్శనను కేంద్ర ఎంఎస్ఎంఈలశాఖ సహాయ మంత్రి భాను ప్రతాప్ సింగ్ వర్మ సోమవారం ప్రారంభించారు. కేవీఐసీ కూడా "ఖాదీ కారిగార్ సమ్మేళనం" (ఖాదీ కళాకారుల సమావేశం) నిర్వహించింది. ఇందులో 2000 మందికి పైగా ఖాదీ కళాకారులు, ముఖ్యంగా వారణాసి ప్రయాగ్రాజ్, జౌన్పూర్, మీర్జాపూర్, ఘాజీపూర్, సోన్‌భద్ర మొదలైన 12 జిల్లాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉత్తర ప్రదేశ్, జమ్మూ డ కాశ్మీర్, పంజాబ్, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, లేహ్, -లడఖ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్ ఇతర రాష్ట్రాల నుండి ఖాదీ సంస్థలు మొత్తం 105 స్టాల్‌లను ఏర్పాటు చేశాయి. అనేక ఖాదీ సంస్థలు, పీఎంఈజీపీ యూనిట్లు, వివిధ రాష్ట్రాల నుండి అనేక ఎస్యూఆర్టీఐ క్లస్టర్‌లు కూడా తమ స్టాల్‌లను ఏర్పాటు చేశాయి.

జమ్మూ డ కాశ్మీర్లోని పర్వతప్రాంతాల నుంచి సేకరించిన అత్యున్నత తేనె, అనేక రకాల కాశ్మీరీ, రాజస్థానీ ఉన్ని శాలువాలు, పశ్చిమ బెంగాల్ నుండి ముస్లిన్ వస్త్రాలు, పశ్చిమ బెంగాల్, బీహార్ నుండి పట్టు వస్త్రాలు, పంజాబ్ నుండి కోటి శాలువాలు, తోలు వంటి అనేక అద్భుతమైన ఖాదీ ఉత్పత్తులను ప్రదర్శనలో చూడవచ్చు. కాన్పూర్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ నుండి తెచ్చిన టెర్రకోట కుండలను కూడా అమ్ముతున్నారు. విస్తృతంగా ప్రశంసలు పొందిన మీర్జాపూర్, ప్రయాగరాజ్ చేతి ముడి తివాచీలు ప్రదర్శనలో అతిపెద్ద ఆకర్షణలు. కోవిడ్ -19 లాక్‌డౌన్ తర్వాత కేవీఐసీ వారణాసిలో నిర్వహిస్తున్న రెండో ప్రదర్శన ఇది.

ఖాదీ ఎగ్జిబిషన్ ఖాదీ కారిగార్ సమ్మేళన్ నిర్వహించడం ద్వారా కళాకారులను బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తున్న కెవిఐసిని మంత్రి వర్మ ప్రశంసించారు. గత కొన్ని సంవత్సరాలుగా వారణాసి వివిధ ఖాదీ కార్యకలాపాల కేంద్రంగా అవతరించిందని ఆయన అన్నారు. స్పిన్నింగ్, నేయడం, తేనెటీగల పెంపకం, కుండల తయారీ వంటి దాదాపు అన్ని గ్రామీణ సాంప్రదాయ కళల విశిష్టత ఇక్కడ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఇది చేతివృత్తుల వారికి స్వయం ఉపాధిని సృష్టిస్తున్నది. వారిని ఆత్మనిర్భర్గా మార్చింది. కళాకారులకు వారి ఉత్పత్తులను మార్కెట్ చేయడానికి, వారి ఆదాయాన్ని పెంపొందించడానికి కేవీఐసీ ఎగ్జిబిషన్ ఒక పెద్ద వేదికను కూడా అందిస్తుంది.

ఈ సందర్భంగా కేవీఐసీ చైర్మన్ సక్సేనా మాట్లాడుతూ వారణాసి రాష్ట్రస్థాయి ఖాదీ ప్రదర్శన కళాకారుల ''ఆత్మనిర్భర్ భారత్'' నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. సంప్రదాయ కళలను బలోపేతం చేయడానికి స్థానిక కళాకారులను శక్తిమంతం చేయడానికి కేవీఐసీపెద్ద సంఖ్యలో ఖాదీ సంస్థలు, పీఎంఈజీపీ యూనిట్లు ఎస్ఎఫ్యూఆర్ఐ క్లస్టర్‌లను ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ ఎగ్జిబిషన్ 'వోకల్ ఫర్ లోకల్' భావనకు అనుగుణంగా, ప్రోత్సాహకరంగా ఉంటుందని, ఖాదీ వాడకాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. ప్రత్యేకించి, వారణాసి ప్రధానమంత్రి పార్లమెంటరీ నియోజకవర్గం. ఖాదీని ప్రోత్సహించడానికి చేతివృత్తుల వారికి మద్దతుగా అనేక కార్యక్రమాలను కేవీఐసీ రూపొందించింది. వారణాసిలో ప్రస్తుతం 134 ఖాదీ సంస్థలు పనిచేస్తున్నాయి, ఇక్కడ మొత్తం శ్రామిక శక్తిలో దాదాపు 80 శాతం మహిళలు ఉన్నారు.

ప్రతి పేదవారి కళ్లలో ఆనందాన్ని చూడడం.. వారి జీవితంలో శ్రేయస్సును అందించడమే "మోదీ మిషన్": కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:దేశంలోని ప్రతి పేదవాడి కళ్లలో ఆనందాన్ని, వారి జీవితంలో శ్రేయస్సును అందించడమే "మోదీ మిషన్" అని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి శ్రీ ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ అన్నారు. ఈ రోజు ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లోని మహాత్మాగాంధీ స్టేడియంలో దివ్యాంగ్‌జన్‌లు మరియు వయోవృద్ధులకు వివిధ వైద్య సహాయ పరికరాలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సామాజిక న్యాయం,సాధికారత శాఖ సహాయ మంత్రి శ్రీ ఎ నారాయణస్వామి కూడా పాల్గొన్నారు. ఏడీఐపీ, కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ రాష్ట్రీయ వయోశ్రీ యోజనా కిందఏఎల్ ఐఎంసీఓ, కాన్పూర్ ట్రైకిళ్లు, వీల్‌చైర్లు, క్రచ్, వాకర్లు, ప్రొస్థెటిక్ మరియు ఆర్థోటిక్ పరికరాలను, రాంపూర్‌లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 2000 మంది దివ్యాంగులకు మరియు సీనియర్ సిటిజన్‌లకు వినికిడి పరికరాలను ఉచితంగా అందించారు. శ్రీ నఖ్వీ గత 7 సంవత్సరాలలో ప్రభుత్వం సుపరిపాలన, సమగ్ర అభివృద్ధి మరియు పేద మరియు బలహీన వర్గాల వారి ''బుజ్జగింపు లేకుండా సాధికారత'' పై దృష్టి పెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర ప్రదేశ్ మంత్రి శ్రీ బలదేవ్ అలుక్కా, యుపీ శాసన మండలి సభ్యులు డాక్టర్ జైపాల్ సింగ్ వ్యాస్, శ్రీ సూర్య ప్రకాష్ పాల్, ఛైర్మన్ ప్యాక్‌ఫెడ్, బీజేపీ రాంపూర్ అధ్యక్షుడు శ్రీ అభయ్ గుప్తా మరియు సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. రాంపూర్ లోని నుమైష్ మైదానంలో నిర్వహిస్తున్న "హునార్ హాత్" ప్రదర్శనను కూడా కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి శ్రీ ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ సందర్శించారు. హస్త కళల కోసం కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఎగుమతి ప్రోత్సాహక మండలి కళాకారులు, హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్/ మరియు మార్కెట్లను అందించడానికి కలిసి పనిచేస్తున్నాయని ఆయన అన్నారు. చేతివృత్తిదారులు మరియు హస్తకళాకారులకు సులభంగా రుణాలు మరియు ఇతర ఆర్థిక సహాయం అందించడానికి కెనరా బ్యాంక్ "హునార్ హాత్" లో ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసింది. "హునార్ హాత్" జీఈఎం (గవర్నమెంట్ ఇ మార్కెట్ ప్లేస్) లో కూడా అందుబాటులో ఉందని.. ఇది దేశీయ కళాకారులు మరియు హస్తకళాకారుల స్వదేశీ ఉత్పత్తులకు పెద్ద ఎత్తున జాతీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లను అందిస్తుందని మంత్రి నఖ్వీ వివరించారు. 30కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి వచ్చిన 700 మంది చేతివృత్తులవారు మరియు హస్తకళాకారులు రాంపూర్‌లో ఏర్పాటు చేసిన "హునార్ హాత్" వద్ద తమ స్వదేశీ ఉత్పత్తులను అందుబటాలోకి తెచ్చారు.

గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లా చోటిల సమీపంలోని నవ గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీ సరస్వతి విద్యామందిర్ భవనాన్నిజాతికి అంకితం చేయనున్న కేంద్ర కేబినెట్ మంత్రి పురశోత్తం రూపాల

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:ఇండియన్ ఫ్యామిలీ అసోసియేషన్ కెనడా మరియు ఉర్మిసరోజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుజరాత్‌లోని సురేంద్రనగర్ చోటిల సమీప వాడి వశహటత్ నవగ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సరస్వతి విద్యామందిర్ ప్రారంభోత్సవ వేడుక 17/10/21 ఆదివారం ఉదయం 10 నుండి 12:30 వరకూ జరుగుతుంది..

పవిత్ర మాధవ్ ప్రియదాస్జీ స్వామి సమక్షంలో పాఠశాల గదులను భాయ్ శ్రీ రమేష్ ఓజా అందజేస్తారు మరియు కేంద్ర మంత్రి శ్రీ పరశోత్తం రూపాల ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

ఈ కార్యక్రమానికి ఎంపీ శ్రీ రాంభాయ్ మోక్రియా మరియు సౌరాష్ట్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నితిన్ పెథాని కూడా హాజరవుతారు.

జీవితాన్ని మార్చే అనుభవాల ద్వారా తక్కువ ప్రయోజనాలకు సేవ చేయాలనే ఉద్దేశంతో దాతృత్వానికి దారితీసే మానవ జీవితాన్ని మెరుగుపరచడానికి ఒక వ్యక్తి లేదా సంస్థ యొక్క పరోపకార కోరిక మరియు ప్రయత్నం ఈ కార్యక్రమం.

అత్యంత వెనుకబడిన వాడి కమ్యూనిటీ విద్యార్థులకు పాఠశాలను నిర్మించడం అలాంటి విజయ గాథల్లో ఒకటి. పాఠశాల ప్రారంభోత్సవం వెనుక కథ ఆసక్తికరంగా ఉంది. ఎందుకంటే ఇది అణగారిన వర్గాల సంక్షేమం కోసం తన సంపాదనను ధారపోసిన ఓ వ్యక్తి చేసిన స్వచ్ఛమైన దాతృత్వ కార్యక్రమం.

ఉర్మిసరోజ్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ జగదీష్ త్రివేది 2016 లో స్థాపించారు. "మానవత్వానికి సేవ చేయడం దేవుడికి చేసే సేవ" అని ఆయన విశ్వసించారు. సమాజానికి సేవ చేయడం కోసం శ్రీ త్రివేది తన మిగిలిన జీవితాన్ని అర్పించారు. మరియు పదవీ విరమణ తర్వాత 11 కోట్లు (1.47 మిలియన్ డాలర్లు) విరాళంగా ఇవ్వడానికి బహిరంగ నిబద్ధతను ఇచ్చారు. సోషల్ ఆడిట్ కోసం అందుబాటులో ఉన్న తన ప్రచురణలలో అతను తన ఆదాయాలు మరియు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు చేసిన సహకారం గురించి బహిరంగంగా ప్రకటించారు.

పాఠశాల నిర్మాణం వాస్తవానికి కేంద్ర మంత్రి శ్రీ పరశోత్తం రూపాల చేత ప్రేరేపించబడింది. వాడి సమాజంలో చాలా వెనుకబడిన పిల్లల విద్య కోసం ప్రాథమిక మౌలిక సదుపాయాలను పొందాలనే భరోసాలో స్ఫూర్తిదాయకమైన పాత్రను ఆయన పోషించారు.

కొన్ని సంవత్సరాల క్రితం శ్రీ పరశోత్తం రూపాలనవ గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ పరశోత్తం రూపాల..వాడి కులాల పిల్లలకు ప్రాథమిక విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉండాలని ప్రత్యేకంగా ఆకాంక్షించిన విషయాన్ని ఇక్కడ పేర్కొనవచ్చు. గ్రామీణ-పట్టణ విభజన మధ్య అంతరాన్ని తగ్గించడం లక్ష్యంగా ఈ ప్రయత్నం గుజరాత్‌లో ఒక ఉదాహరణగా నిలుస్తుందని ఆయన సూచించారు.ఉర్మిసరోజ్ చారిటబుల్ ట్రస్ట్ యొక్క శ్రీ జగదీష్ భాయ్ ఆ వెంటనే పాఠశాలకు రెండు గదులను నిర్మించారు.వాడి వసాహత్ లోని సరస్వతి విద్యామందిర్ "సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ ఔర్ సబ్‌కా ప్రయాస్" కి నిజమైన ఉదాహరణగా నిలుస్తుంది.

టీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం: చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ఇల్లందకుంట, అక్టోబర్ 16:: టీఆర్ఎస్ పార్టీతోనే హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాత మధు సమక్షంలో ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీలో సోమవారం చేరారు. వారికి సుంకె రవిశంకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ.. ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. గెల్లు శ్రీనివాస్‌యాదవ్ గెలుపు కోసం శాయశక్తులా కృషిచేయాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్‌లో చేరినవారిలో గొట్టె రాజశేఖర్, దాసారపు సంతోష్, రేణికుంట్ల రాజీవ్, రౌతు సాగర్, తదితరులున్నారు.

వరంగల్‌లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు స్థలం కేటాయింపు

హైదరాబాద్ , అక్టోబర్ 18: వరంగల్ జిల్లాలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. విద్యారంగంలో ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్ వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వరంగల్‌లో గత ఐదేండ్లుగా అద్దె భవనంలో నడుస్తున్నది. ప్రభుత్వానికి అభ్యర్థన పంపిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సొసైటీకి హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామంలో 50 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని మార్కెట్ రేటుకు కేటాయిస్తూ జీవో నెంబర్ 93ని జారీ చేసింది.

ఈ జీవోని ప్రభుత్వం తరపున రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేతుల మీదుగా, రాజ్యసభ సభ్యుల సురేశ్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సొసైటీ వైస్ చైర్మన్, ఉపాధ్యక్షుడు గుస్తీ జె. నోరియాకు అందజేశారు. అలాగే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వరంగల్‌కు రావడానికి సహకరించిన ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు, చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్, హన్మకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతులకు ఆ స్కూల్ సొసైటీ ఉపాధ్యక్షుడు నోరియా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మాణిక్యం ఠాగూర్‌ను కలిసిన వేములవాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 18 (నేటి నిజం ప్రతినిధి): హుజూరాబాద్ నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం నిమిత్తం కరీంనగర్ ఆదివారం చేరుకున్నారు తెలం గాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్ కు సోమవారం హోటల్ మైత్రీలో వేములవాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆది శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి స్వాగతం పలికి ఆత్మీయ సత్కారం చేశారు వీరి వెంట రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పాత సత్య లక్ష్మి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగుల విష్ణు ప్రసాద్, మాజీ ఎంపిటిసి హైమద్ పాషా (అడ్డు), తదితరులు ఉన్నారు

ఈశాన్య భారతదేశంలో వైమానిక కనెక్టివిటీని విస్తరించే 6 మార్గాలను వర్చువల్‌గా ప్రారంభించారు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా, ఎంఓఎస్, పౌర విమానయానం, జనరల్ డాక్టర్ వి.కె సింగ్ (రిటైర్డ్) శ్రీ రాజీవ్ బన్సల్, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ (ఎంఓసిఎం) సెక్రటరీలు ఈశాన్య భారతదేశంలో వైమానిక అనుసంధానాన్ని విస్తరిస్తూ 6 మార్గాలను వర్చువల్‌గా ప్రారంభ

కాంగ్రెస్‌కు ఒక అవకాశం ఇవ్వండి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి): హుజురాబాద్ లో కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు .సోమవారం వీణవంక మండలం కిష్టంపేట లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెంకట్ తో కలిసి గడప గడప ప్రచారంలో పాల్గొన్నారు . సందర్భంగా ఈ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి నెట్టారని , నెరవేర్చలేదని హామీలను హుజరాబాద్ లో ఒక అవకాశం ఇవ్వాలని , వెంకట్ గెలిస్తే ప్రజాసంక్షేమం కోసం పాటుపడే వ్యక్తి అని అన్నారు . ఏడేళ్లలో తెరాస చేసింది ఏమీ లేదని , రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ఇచ్చిన విమర్శించారు . రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు .ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు 3 ఎకరాల భూమి , నిరుద్యోగులకు ఉద్యోగ భృతి , తెలంగాణ ఏర్పడ్డాక ఉద్యోగాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి మాట తప్పాడని అన్నారు . కెసిఆర్ ను నమ్మే పరిస్థితిలో హుజురాబాద్ ప్రజలు లేరని తెలిపారు . ఈ ప్రచార కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల వేములవాడ చెందిన కాంగ్రెస్ నాయకులు ఆది శ్రీనివాస్ సాగరం వెంకటస్వామి నాగుల విష్ణు ,అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు .

అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి దహన సంస్కారాలకు టి ఆర్‌నీ కే ట్రస్ట్ ఆర్థిక సహాయం

-మరోసారి మానవత్వాన్ని చాటుకున్న తోట రామ్ కుమార్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 18 (నేటి నిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని లక్ష్మీపూర్ కు చెందిన దాసరి శంకర్ అనే 55 సంవత్సరాల నిరుపేద గత కొద్దికాలంగా మెదడువాపు తో పాటు కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నాడు. చికిత్సకు ఆర్థిక పరిస్థితి సహకరించక పోవడంతో ఆరోగ్యం క్షీణించి ఆదివారం రోజున అద్దె ఇంట్లో మృతి చెందాడు. కనీసం దహన సంస్కారాలకు సైతం డబ్బులు లేక అద్దె ఇంటి యజమానులు మృతదేహాన్ని ఇంట్లో ఉంచడానికి వీలులేదని చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమ పరిస్థితి పై నడిరోడ్డుపై తండ్రి మృతదేహాన్ని ఉంచి దహన సంస్కారాల కోసం డబ్బులు అర్థిస్తున్న తీరు కంటతడి పెట్టించింది. కాగా విషయం తెలుసుకున్న వేములవాడ టి ఆర్ కే ట్రస్ట్ చైర్మన్ తోట రామ్ కుమార్ స్పందించి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి వారికి అండగా నిలిచారు. మానవతా హృదయంతో అనేకమంది ఈ క్రమంలో ముందుకు వచ్చినట్లు సమాచారం. కాగా తమ పరిస్థితిపై చలించి ఆర్థికంగా ఆదుకు న్న టిఆర్‌కె చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మ హేష్ కు మార్ కు దాసరి శంకర్ కుటుంబ సభ్యులు వినమ్రంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

భారతీయ సంస్కృతి, హస్తకళల నుంచి పొందిన స్ఫూర్తితో

తానా బానా వాల్ టెక్చర్స్ బై రాయల్ ప్లే ను ప్రవేశపెట్టిన ఏషియన్ పెయింట్స్

హైదరాబాద్ , అక్టోబర్ 18:ఈ ఏడాది పండుగ సీజన్ ను పురస్కరించుకొని అందమైన వాల్ టెక్చర్స్ కలెక్షన్ తానా బానా వాల్ టెక్చర్స్ బై రాయల్ ప్లే ను ఏషియన్ పెయింట్స్ ను ప్రవేశపెట్టింది. భారతీయ హస్తకళల వారసత్వం నుంచి పొందిన స్ఫూర్తితో తానా బానా రూపుదిద్దుకుంది. ఇది వివిధ భావోద్వేగాలను, జ్ఞాపకాలను గుర్తుకు తెస్తుంది. మన పూర్వీకుల ఇళ్లలో ఉండే మంచాలు మొదలుకొని పూలు, పండ్లు పెట్టే వెదురు బుట్టల దాకా, అమ్మమ్మ, నాయనమ్మల వెలకట్టలేని ఇక్కత్ చీరలు మొదలుకొని పెళ్లికూతురు బీరువాలోని బాందేజ్ దుపట్టా దాకా తానా బానా మనకు కనిపిస్తూనే ఉంది. మన గోడలకు, జీవితాలకు వెలుగు తెచ్చేలా అది మళ్లీ సృష్టించబడింది. తానా బానా అంటే ఒక విధమైన అల్లిక. దుస్తులపై కనిపించే దాన్ని అలా వ్యవహరిస్తారు. నేత, దాని నుంచి దారం, అక్కడి నుంచి నూలు, దాని నుంచి వస్త్రం వస్తాయి.

వస్త్రాలు జీవనశైలిని ఏర్పరుస్తాయి. తానా బానా కలెక్షన్ 8 అందమైన వాల్ టెక్చర్స్ ను కలిగిఉంది. నైపుణ్యవంతులైన హస్తకళాకారుల నుం చి వారసత్వంగా వచ్చిన ఆ కళలకు ఒక అభినందనగా ఇవి రూపుదిద్దుకున్నాయి. ప్రాచీన సంప్రదాయాలు మొదలుకొని సమకాలీన ఇళ్ళ దాకా 'తానా బానా' ఫినిషెస్ ఎంతో విలక్షణంగా ఉంటాయి, దేశంలోని అన్ని ప్రాంతాలకు అవి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ టెక్చర్స్ పలు షేడ్ కాంబినేషన్స్ లో మెటాలిక్, నాన్ మెటాలిక్ రకాల్లో లభిస్తాయి. ఇవి మీ ఇంట్లో వివిధ చోట్లకు ఆధునికతతో కూడిన పర్సనల్ టచ్ ను అందిస్తాయి. ప్రతి టెక్చర్ కూడా తన భావనను ఒక స్థానిక కళ నుంచి పొందింది. అది ఒక రాష్ట్రంలో లేదా హస్తకళలకు చెందిన వర్గంలో ప్రఖ్యాతి పొందినదై ఉండవచ్చు. చార్ పై టెక్చర్ అనేది ఉత్తరభారతదేశంలో విస్తృతంగా కనిపించే అల్లిక నుంచి స్ఫూర్తి పొందింది. పామ్ వీవ్ టెక్చర్ అనేది భారతదేశ పశ్చిమ తీర రాష్ట్రాలైన గోవా, కేరళ అధికంగా కనిపించే జెయింట్ పామ్ చెట్ల ఆకుల నుంచి పొందిన స్ఫూర్తితో రూపుదిద్దుకుంది.

'బందేజ్' టెక్చర్ దాని పేరుకు తగినట్లుగా రాజస్థాన్, గుజరాత్ లకు చెందిన ప్రాచీన టై- డై రూపం నుంచి పొందిన స్ఫూర్తితో రూపుదిద్దుకుంది. ఫర్నీచర్, కళావస్తువుల తయారీకి సంబంధించి ఈశాన్య రాష్ట్రాల వెదురు హస్తకళల నుంచి పొందిన స్ఫూర్తితో బాస్కెట్ టెక్చర్ వచ్చింది.

మద్రాస్ చెక్స్ టెక్చర్ అనేది దక్షిణాది రాష్ట్రాల్లో కనిపించే కళారూపానికి ప్రతీకగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిషాల నుంచి పొందిన స్ఫూర్తితో ఇక్కత్ టెక్చర్ రూపుదిద్దుకుంది. పామ్ పామ్ టెక్చర్ అనేది పూర్తిగా ఆనందానికి సంబంధించింది.

కేపి ఓవర్‌సీస్ ఏడ్యుకేషన్ ఎయిర్ కెనడా సమన్వయంతో విమాన ప్రయాణ రుసుము తగ్గింపు

హైదరాబాద్, అక్టోబర్ 18: విదేశాలలో విద్యాభ్యాసం కొరకు సహాయం చేసే రంగంలో విశిష్ట విద్యా సేవలను అందిస్తున్న ప్రఖ్యాత కేసి ఓవరసీస్ ఏడ్యుకేషన్, అత్యంత పెద్దదైన జాతీయ మరియు అంతర్జాతీయ కెనడా విమాన శాఖతో భాగస్వామ్యం కుదుర్చుకొని కెనడాకు విద్యాభ్యాసం కొరకు వెళ్ళే విద్యార్థులకు విమాన ప్రయాణ చార్జీల తగ్గింపు సౌకర్యాన్ని కలుగు చేస్తున్నది. ఈ భాగస్వామ్యం ఫలితంగా కెనడాకు విద్యాభ్యాసం కోసం వెళ్ళే విద్యార్థులకు విమాన ప్రయాణ చార్జీల తగ్గింపు 15% వరకు ఇవ్వబడుతుంది..

ఈ సౌకర్యం పొందగోరే విద్యారు&థలు నేరుగా వారి విమాన టికెట్లను ఎయిర్ కెనడా వెబ్-సైట్ www,,aircanada.com ప్రధాన కోడ్‌ను వినియోగం చేస్తూ 31 అక్టోబర్ వరకు ఏర్పాటు చేసుకోవచ్చును మరియు వారు ఈ తేదీ లోపే టికెట్లు ఏర్పాటు చేసుకున్నది నిశ్చయపర్చుకోవాలి. ఈ విధంగా తగ్గింపు కొరకు 2021 నుండి 31 అక్టోబర్ వరకు విమానాల టికెట్లు ఏర్పాటు చేసుకోవచ్చును. ఆకస్తి కలిగిన కేసి యొక్క కెనడా నిపుణులను mtol@kcoverseas.com ద్వారా తదుపరి వివరాల కొరకు సంప్రదించవచ్చును.

పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉందాం : ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య

హైదరాబాద్ , అక్టోబర్ 18: పేద ప్రజల అభివృద్ధి కోసం పని చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని, కోట్లాది రూపా యలతో పేదవారి కోసం పలు సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన సీఎం కేసీఆర్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో బూత్‌కమిటీ, ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న కార్యకర్తలకు ఆయన పలు సూచనలు చేశారు.

అనంతరం అయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలన్నారు.ప్రతి ఓటరును కలుసు కోవాలన్నారు. బీజేపీ కుట్రలను ప్రజలకు వివరించాలన్నారు గ్యాస్, పెట్రోల్, డిజీల్ రేట్లు పెంచడం, నిత్యవసరాల పెరగ డానికి కారణమైన బీజేపీ కుట్రలను వివరించాల న్నారు. వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చి రైతులకు అన్యాయం చేస్తూ , ఉత్తరప్రదేశ్‌లో శాంతి యుతంగా నిరసనలు తెలుపుతున్నా రైతులను కారుతో చంపించిన విషయాలను రైతులకు తెలియ జెప్పాలన్నారు.

ధనబలంతో ఎన్నికలలో పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ డబ్బుతో ప్రజలను ప్రలోభపెట్టాలని చేస్తున్న ప్రయత్నాలను కార్యకర్తలు గమనించాలన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త ప్రజలతో మమే కమై ప్రచారం చేసి భారీ మెజార్టీతో గెల్లు శ్రీనివాస్ యాదవును గెలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసి.. భర్త ఆత్మహత్య

బెంగళూరు, అక్టోబర్ 18:: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను హత్య చేసిన భర్త, అనంతరం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ ఘటన జరిగింది. లేత్ మిషన్ ఆపరేటర్‌గా పనిచేసే 32 ఏండ్ల మంజునాథ్, భార్య 28 ఏండ్ల రోజా ఈ ఏడాది ప్రారంభంలో బెంగళూరు తీగలరాపాల్య ప్రాంతంలోని అద్దె ఇంట్లోకి మారారు. మంజునాథ్ మద్యం సేవించడంతో భార్యాభర్తల మధ్య నిత్యం గొడవ జరిగేది. తరచుగా అతడు భార్యను కొట్టేవాడు.

ఆదివారం మధ్యాహ్నం మంజునాథ్, రోజా పొట్లాడుకోవడం, అరుచుకోవడాన్ని పొరుగువారు విన్నారు. అయితే సాయంత్రానికి వారి ఇంటి తలుపు లోపల నుంచి బోల్ట్ వేసి ఉన్నది. పొరుగువారు పిలిచినా తలుపు తెరువకపోవడంతో అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

డోర్ పగులగొట్టి లోపలికి వెళ్లిన పోలీసులకు భార్యాభర్తలిద్దరు మరణించి ఉండటాన్ని గమనించారు. భార్య మృతదేహం నేలపై ఉండగా భర్త మృతదేహం సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడ ుతున్నది. దీంతో భార్య రోజాను కొట్టి చంపిన అనంతరం భర్త మంజునాథ్ ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తగా 332 కోవిడ్ కేసులు

అమరావతి, అక్టోబర్ 18:ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కరోనా కేసులు భారీగా తగ్గాయి. గడిచిన 24 గంటల్లో 30,219 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా.. 332 మందికి పాజిటివ్ నిర్ధారణ అయింది. కోవిడ్ వల్ల కృష్ణా జిల్లాలో ఇద్దరు, చిత్తూరు, గుంటూరు, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. గడిచిన 24 గంటల్లో 651 మంది కోవిడ్ నుంచి పూర్తిగా కోలుకుని ఆరోగ్యవంతులైయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5,709 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటి వరకు మొత్తం 20,60,804 కేసులు నమోదు కాగా.. ఇందులో 20,40,782 మంది కోవిడ్ నుంచి కోలుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 14,313 మంది మృతి చెందారు.

బీజేపీకి ఓటేందుకెయ్యాలి ఈటల.. : కరీంనగర్ మేయర్ సునీల్‌రావు

హుజురాబాద్, అక్టోబర్ 18: బీజేపీ పార్టీకి ఓటు ఎందుకు వేయాలో చెప్పాలని ఆ పార్టీ నేత ఈటల రాజేందర్‌ను కరీంనగర్ మేయర్ సునీల్‌రావు ప్రశ్నించారు. పట్టణంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలను ఈటల రాజేందర్ ఓటు అడిగే అర్హత లేదన్నారు. గ్యాస్ , పెట్రోల్, డిజీల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యులపై భారం మోపినందుకా? నల్లచట్టాలను తెచ్చి రైతులకు అన్యాయం చేసినందుకా? నల్ల చట్టాలను రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న రైతులను కార్లతో తొక్కి చంపినందుకు ఓటేయ్యాలా అని ప్రశ్నించారు.

రాజేందర్ నియోజకవర్గ ప్రజలను కించపరిచేలా పదేపదే మాట్లాడటం సిగ్గుచేటన్నారు. టీఆర్ఎసోళ్లు మద్యం, డబ్బులు ఎరవేస్తూ ప్రజలను ప్రలోభాలు పెడుతున్నారని ఈటల మాట్లాడడం ప్రజలను కించపరిచినట్లేనన్నారు. ఇక్కడి ప్రజలు చైతన్యవంతులు అని ఎవరిని అక్కున చేర్చుకోవాలో, ఎవరిని బొంద పెట్టాలో వాళ్లకు తెలుసునని హితవు పలికారు. ఇప్పటి వరకు ఈటల సుమారు వంద కోట్లు ఖర్చు పెట్టడమే కాక టీఆర్ఎస్ విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెడుతుందని బద్నాం చేయడం సమంజసం కాదన్నారు.

టీఆర్ఎస్ పార్టీ ప్రలోభాలకు గురి చేస్తుందని అంటున్న నువ్వు బొట్టుపిల్లలు, గడియారాలు, గొడుగులు, గ్రైండర్‌లు, కుట్టుమిషన్‌లు పంచినా ప్రజల నుంచి స్పందన రాకపోవడంతో రాజేందర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడన్నారు. పైగా దొంగే దొంగ అన్న చందంగా టీఆర్ఎసోళ్లు ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నాం నడం హాస్యస్పదమన్నారు. నియోజకవర్గంలో మొదటి నుంచి టీఆర్ఎస్ బలంగా ఉందని, ఆయన పార్టీలోకి రాక ముందే పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు ఎంపికైన ఘనత ఉందన్నారు.

నియోజకవర్గంలో బలమైన క్యాడర్ ఉన్న టీఆర్ఎస్ టికెట్‌ను ఇవ్వడంతో ఈటల గెలుపొందాడే తప్ప ఆయనకంటూ సొంత బలం ఏమిలేదన్నారు. ఆరుసార్లు కేవలం కేసీఆర్ చరిష్మా, కారు గుర్తు మీద రాజేందర్ గెలిచి కేసీఆర్‌ను విమర్శించడం సిగ్గు చేటన్నారు. ఓటు వేసి గెలిపించిన ప్రజలను మద్యానికి అమ్ముడు పోతున్నారని కించపరిచేలా మాట్లాడుతుండడం దేనికి సంకేతమన్నారు. బీజేపీ పార్టీ ప్రజలకు ఏం చేస్తుందో చెప్పి ఓట్లు అడుగాలని డిమాండ్ చేశారు. రాజేందర్ ఎక్క డైనా గ్యాస్, పెట్రోల్, డీజీల్ ధరల పెంపు గురించి మాట్లాడుతున్నావా? ధరలు తగ్గిస్తామని కనీసం ఎక్కడైన చెబు తున్నావా అని ప్రశ్నించారు.సామాన్య ప్రజల నడ్డీ విరిచేది బీజేపీ అయితే టీఆర్ఎస్ కడుపులో పెట్టి చూసుకుంటుందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలపై మాట్లాడిన ఈటల రాజేందర్‌కు వాటిని రద్దు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చిందా? వాటి గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈటల ద్వంద వైఖరి అనుసరిస్తున్నాడని, ప్రజల మీద ప్రేమ ఉంటే వెంటనే ధరలు తగ్గించేలా బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని హితవు పలికారు. విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెడుతున్న ఈటల ఓటర్లను కొనే ప్రయ త్నం చేస్తున్నాడని కానీ ప్రజలు చైతన్యవంతులని పనిచేసే ప్రభుత్వాన్నే ఆశీర్వదిస్తారని అన్నారు. దుర్మార్గ పనులు ఆయన చేస్తూ ఎదుటివాళ్ల మీద దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు.

రైతన్నల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నది రైతన్నకు అండగా ఉన్నది టీఆర్ఎస్ అయితే కరెంట్ మోటర్లకు మీటర్ బిగించాలని చూస్తుంది బీజేపీ పార్టీ అన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు వినోద్ కుమార్ ఎంతో కష్టపడి రైల్వే లైన్ కాజీపేట నుండి హుజూరాబాద్ మీదుగా కరీంనగర్ వరకు తీసుకురాగా కేంద్రం దానిని రద్దు చేసిందని, దీని గురించి ప్రజలకు సమాధానం ఏం చెబుతావన్నారు. రైల్వే లైన్ రద్దు కావడంతో ఇక్కడి ప్రజలకు చాలా అన్యాయం జరిగిందని, ఈ లోటును ఎలా పూడ్చుతావన్నారు.

ఈటల ఓటమి ఖాయమైందని, ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, కార్పొరేటర్ పిట్టల శ్రీనివాస్, నాయకుడు బత్తుల రాజలింగం తదితరులు ఉన్నారు.

గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను గెలిపించండి..5 వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిచూపిస్తాం: మంత్రి హరీశ్‌రావు

హుజురాబాద్, అక్టోబర్ 18:ఈ ఉప ఎన్నికల్లో గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను గెలిపిస్తే..హుజూరాబాద్ నియోజకవర్గంలో 5 వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టి, లబ్ధిదారులతో గృహప్రవేశం చేయిస్తామని మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. హుజూరాబాద్ మండలంలోని ఇందిరానగర్, శాలపల్లిలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, ఇవి నడుమంతరపు ఎన్నికలని, ఇంకా రెండున్నరేళ్లు రాష్ట్రంలో టీఆర్ఎస్ సర్కారే ఉంటుందన్నారు. ఎన్నికల తర్వాత ఇక్కడ ఏ పని జరగాలన్నా సీఎం ప్రేమ ఉండాలని, అందుకే మనమంతా గెల్లును గెలుపించుకొని కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. ఈటల రాజేందర్ పార్టీ బీజేపీ ఉండేది ఢిల్లీలో.. ఇక్కడ ఉండేది టీఆర్ఎస్ పార్టీ అనే విషయం ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీ ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తుంటే.. టీఆర్ఎస్ పార్టీ సంపదను పెంచి పేదలకు పంచుతోందని స్పష్టంచేశారు. గ్యాస్ సిలిండర్ ధర వెయ్యి రూపాయలు చేసిన ఘనత బీజేపీ సర్కారుదేనని, సబ్సిడీ కూడా ఎగగొట్టారని విమర్శించారు. ఓ వైపు పేదలపై భారం మోపుతున్న బీజేపీ సర్కారు..మరోవైపు పెద్ద మొత్తంలో లోన్లు తీసుకున్న వ్యాపారవేత్తలకు రూ. పది లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిందని మండిపడ్డారు. నిరుపేదలకు, రైతులకు బీజేపీ సర్కారు చేసిందేమీ లేదన్నారు.

అన్నదాతలతోపాటు అన్ని వర్గాలనూ ఆదుకుంటున్నది సీఎం కేసీఆర్ ఒక్కరేనని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. అభాగ్యులకు ప్రతినెలా రంచనుగా రూ. 2016 /3016 ఆసరా పింఛన్ ఇస్తున్న ఏకైక సర్కారు తెలంగాణ మాత్రమేనని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద నిరుపేద ఆడబిడ్డల పెళ్లిల్లకు అక్షరాల లక్ష నూటా పదహార్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు యాసంగి, వానాకాలం పంటకు కలిపి ఎకరానికి పది వేల పెట్టుబడి ఇస్తున్నామని వివరించారు. ఇంత చేస్తున్న సీఎం కేసీఆర్‌ను పట్టుకొని ఈటల రాజేందర్ ఇష్ట మొచ్చినట్లు మాట్లాడుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ శాలపల్లిలోనే ఈటల రాజేందర్‌ను తన తమ్ముడంటూ సీఎం కేసీఆర్ ఆప్యాయత చూపారని గుర్తుచేశారు. కానీ ఈటల రాజేందర్ కృతజ్ఞత లేకుండా కేసీఆర్‌ను తిడుతున్నాడని దుయ్యబట్టారు. నోటికొచ్చినట్లు మాట్లాడడం కాదు ఈటల రాజేందర్..గెలిస్తే ప్రజలకు ఏం చేస్తావో చెప్పు? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మంత్రిగా ఉన్న సమయంలోనే నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా కట్టలేని ఈటల.. రేపు ఎలా గెలుస్తాడు..? ఎలా ఇల్లు కట్టిస్తాడు..? అనేది హుజూరాబాద్ ప్రజలే ఆలోచించుకోవాలన్నారు.ఈటల రాజేందర్ గెలిస్తే కేంద్ర మంత్రితో మాట్లాడి గ్యాస్ సిలిండర్ ధరను రూ. 500 చేయిస్తాడా? అని ప్రశ్నించారు. బీజేపీకి ఓటు వేడయమంటే మన వేలితో మన కన్నునే పొడుచుకోవడం లాంటిదని వ్యాఖ్యానించారు. కారు గుర్తుకు ఓటేసి గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను గెలిపిస్తే.. హుజూరాబాద్ అభివృద్ధి బాధ్యత తనదేనని చెప్పారు.

ఆక్సిజన్ బ్యాంకు సభ్యులకు చిరంజీవి ప్రశంసల వెల్లువ

కొండ దేవయ్య సేవలు అభినందనీయం

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి): గత కొద్ది నెలలుగా చిరంజీవి నెలకొల్పిన టువంటి చిరంజీవి ఉచిత ఆక్సిజన్ బ్యాంక్ ద్వారా మొట్టమొదటిసారిగా తెలంగాణలోనే వేములవాడలో స్థాపించి సేవలను అందించడంలో ఉమ్మడి రాష్ట్రాల లోనే వేములవాడ మొదటి స్థానాన్ని సంపాదించుకున్నది అని చెప్పి చిరంజీవి వేములవాడ ప్రతినిధులు మారం ప్రవీణ్ కుమార్ (పప్పీ) దురిశెట్టి అరుణ్ తేజా చార్లను ప్రత్యేకంగా హైదరాబాద్కు పిలిపించుకొని అభినందించారు ఈ సందర్భంగా వేములవాడ లో అభిమానులకు అన్ని విధాల సహకారం చేయడం తో పాటు వివిధ సామాజిక కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్ కొండ దేవయ్యసేవలు అభినందనీయమని చిరంజీవి అన్నారు అనంతరం దురిశెట్టి అరుణ్ తేజ చారి మాట్లాడుతూ మాకు ఇంతటి సేవచేసే భాగ్యంకల్పించినందుకు మెగాస్టార్ చిరంజీవి కిరామ్ చరణ్ బాబు రవణం స్వామినాయుడుఅభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల వెంకటేష్ కొండ దేవయ్యలకుకృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండ నర్సయ్య ,లిక్కిడి జితేందర్ వర్మ, శీలం విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

కొత్తగా 332 కోవిడ్ కేసులు

అమరావతి, అక్టోబర్ 18:ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కరోనా కేసులు భారీగా తగ్గాయి. గడిచిన 24 గంటల్లో 30,219 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా.. 332 మందికి పాజిటివ్ నిర్ధారణ అయింది. కోవిడ్ వల్ల కృష్ణా జిల్లాలో ఇద్దరు, చిత్తూరు, గుంటూరు, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. గడిచిన 24 గంటల్లో 651 మంది కోవిడ్ నుంచి పూర్తిగా కోలుకుని ఆరోగ్యవంతులైయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5,709 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటి వరకు మొత్తం 20,60,804 కేసులు నమోదు కాగా.. ఇందులో 20,40,782 మంది కోవిడ్ నుంచి కోలుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 14,313 మంది మృతి చెందారు.

బొగ్గు ఉత్పత్తిపై సింగరేణి దృష్టి

హైదరాబాద్ , అక్టోబర్ 18:దేశవ్యాప్తంగా విద్యుత్ కేంద్రాలలో బొగ్గు నిల్వలు తగ్గిపోవడంతో సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి రవాణా పై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ ఐ.ఎ.ఎస్ సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలో లభిస్తున్న బొగ్గు ఉత్పత్తి నిలువలు రవాణా సౌకర్యాల గురించి చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా బొగ్గు కు డిమాండ్ ఉన్నందున రోజువారి లక్ష్యాన్ని మించి బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్, శ్రీరాంపూర్ ఏరియా గనుల ఏజెంట్లు, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.